
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు







కొత్త కార్డులు ఎప్పుడు?

రేషన్ కార్డుల గండం.. నిలువ నీడ లేని నిరుపేదలకు సొంత ఇల్లు అనేది తీరని కల. ప్రభుత్వం ఆ కలను తీర్చడానికి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మించుకు నేందుకు చేదోడుగా సహాయం అంది స్తోంది. అయినప్పటికీ అనే క మంది పేదలు తమ సొంతింటి కలను నెరవేర్చు కోలేకపోతున్నారు. అందుకు కారణం వారికి ప్రభుత్వం జారీ చేసే రేషన్ కార్డు లేకపోవడమే!

ఒక జంట నాలుగేళ్ల క్రితం పెళ్లిచేసుకుంది. గత ప్రభుత్వ హయాంలో వారికి రేషన్ కార్డు రాలేదు. అదే ఇప్పుడు వారికి శాపంగా మారింది. కార్డు లేని కారణంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పీఎంఏవై- 2.0 సర్వేలో అతడు అనర్హతకు గురయ్యాడు.

మరొకరు పీఎంఏవై- 2.0లో పేరు నమోదు చేసుకునేందుకు ప్రయత్నించారు. ఆధార్ నెంబర్ ఇచ్చారు. రేషన్‌కార్డు నెంబరు ఇచ్చారు. అయితే అది అతడి తల్లిదండ్రుల పేరుతో ఉంది. ఆ కార్డు లోని సభ్యుల్లో ఒకరికి ఇల్లు ఉంది. దీంతో అతడు అనర్హుడయ్యాడు. ఇలా ఎంతో మంది పీఎంఏవై- 2.0 సర్వేలో అనర్హత బారిన పడుతున్నారు.

- పేదల సొంతింటి ఆశలపై నీళ్లు
- రేషన్‌కార్డులు లేకపోవడంతో అనర్హత వేటు
- పీఎంఏవై-2 సర్వేలో స్థానం కోల్పోతున్న నిరుపేదలు
- ఇప్పటికే పింఛన్లు, సంక్షేమ పథకాలకు దూరమైన వైనం
- ఏడాదిన్నర క్రితం ఆగిపోయిన దరఖాస్తుల ప్రక్రియ
- 8 నెలలైనా ఊసే లేని కార్డుల వ్యవహారం

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నీడలేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు, ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు చర్యలు చేపడుతోంది. భూమి లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణానికి తోడ్పాటునందిస్తానని ప్రకటించింది. ఇళ్ల నిర్మాణానికి రూ. 3.5 లక్షల నుంచి 4 లక్షల వరకూ సహాయం అందజేస్తానని ప్రకటించింది. దీంతో పేదల సొంతింటి ఆశలకు రెక్కలు వచ్చాయి. లబ్ధిదారుల జాబితా రూపకల్పనలో భాగంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ పీఎంఏవై- 2.0 కింద సర్వే నిర్వహిస్తోంది. దీంతో ఇళ్లు లేని పేదలంతా ఆ సర్వేలో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఊహించని రీతిలో వారిలో చాలా మంది అనర్హత బారిన పడుతున్నారు. రేషన్ కార్డులేదనో, కార్డుదారుల్లోని కుటుంబ సభ్యులకు రేషన్ కార్డులు లేని కారణంగా అనేక మంది పేదలు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలకు అనర్హత బారిన పడుతున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పీఎంఏవై సర్వేలో రేషన్ కార్డు లేని కారణంగా అనర్హతకు వేటు పడుతుండడంతో ఇక తమ సొంతింటి కల నెరవేరదేమోనన్న ఆందోళనకు గురవుతున్నారు.

● వైసీపీ ప్రభుత్వంలో అన్యాయం..

గత వైసీపీ ప్రభుత్వం పేదలకు సెంటు పట్టాల పేరుతో చాలీచాలని విధంగా పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలాలు ఇచ్చింది. తామే ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే రూ. 1.8 లక్షలు తానే ఇచ్చినట్లు ఇచ్చి ప్రజలను వంచించింది. దీంతో ప్రభుత్వం స్థలం ఇచ్చినా అనేక మంది పేదలు నేటికీ ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. జగనన్న కాలనీల పేరుతో నిర్మించిన కాలనీల్లో ఇప్పటికీ రెండింట మూడొంతుల ఇళ్లు పూర్తి కావాల్సి ఉంది. అలా ఇళ్లు నిర్మించుకోకుండా ఆగిపోయినవారు, ఇప్పటికీ స్థలం లేనివారు ప్రభుత్వం ప్రకటించిన గృహనిర్మాణ పథకం ద్వారా సొంత ఇల్లు నిర్మించుకోవచ్చని ఆశ పడుతున్నారు. ఊహించని రీతిలో రేషన్ కార్డుల సమస్య తలెత్తడంతో వారి ఆశలు ఆవిరైపోతున్నాయి. ప్రభుత్వం గృహ నిర్మాణ పథకానికి నిజమైన అర్హులుగా ఉండే నిరుపేదలు, దిన కూలీలు, వలస పను లకు వెళ్లేవారిలో చాలామంది వద్ద రేషన్ కార్డులు కూడా ఉండవు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల విభజన, కొత్త రేషన్ కార్డుల జారీ లేకపోవడంతో కొత్తగా పెళ్లి చేసుకున్నవారికి ఎవరికీ రేషన్ కార్డులు రాలేదు. దీనికి తోడు రకరకాల కారణాలు చూపి గత వైసీపీ ప్రభుత్వం అనేక మం దికి రేషన్ కార్డులు తొలగించింది. ఇలా అనేక మంది పీఎంఏవై- 2.0లో అన ర్హతకు గురయ్యారు.

● ఇప్పటికే పలు పథకాలకు దూరం..

రేషన్ కార్డులు లేని కారణంగా ఇప్పటికే ప్రభుత్వం అందించే పలు సంక్షేమ కార్యక్రమాలకు పేదలు దూరమవుతున్నారు. రేషన్ కార్డులు లేని కారణంగా అనేక మంది వయోవృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు పింఛనుకు దూరమయ్యారు. దీపం- 2.0 కింద ప్రభుత్వం అందజేసిన ఉచిత గ్యాస్ సిలిండర్ కూడా పొందలేకపోయారు. ప్రభుత్వం నుంచి అందే రేషన్ సరుకులు కూడా పొందలేకపోతున్నారు. తాజాగా పీఎంఏవై- 2.0 సర్వేలో కూడా అనర్హత బారిన పడుతుండడంతో మరింత ఆందోళన చెందుతున్నారు.

● పెండింగులో 25 వేల దరఖాస్తులు

గుంటూరు, పల్నాడు, బాపట్ల మూడు జిల్లాల్లో గత వైసీపీ హయాంలో 25వేల దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని తెలుస్తోంది. గడిచిన 8 నెలల్లో ఈ సంఖ్య మరో 10 వేల వరకూ పెరిగే అవకాశం ఉంది. దరఖాస్తు ప్రక్రి యకు అవకాశం లేకపోవడంతో ఆ సంఖ్య కచ్చితంగా తెలియడం లేదు. దరఖాస్తు చేసుకున్నవారు, చేసుకోవాలనుకుంటున్న వారు ఎనిమిది నెలలుగా కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నా, ప్రభుత్వం నుంచి కనీస ప్రకటన రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డులు జారీ చేయాలని వారు వేడుకుంటున్నారు.

రైతులకూ.. గుర్తింపు కార్డు



- ఆధార్ తరహాలో 11 అంకెలతో జారీ
- రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ
- ప్రభుత్వ పథకాలు, సేవల లబ్ధికి అవసరం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

దేశంలోని ప్రతిఒక్కరికీ ఆధార్ గుర్తింపు కార్డు ఉంది. అలాగే రైతులందరికీ కూడా గుర్తింపు కార్డు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ క్రమంలో 11 అంకెలతో కలిగిన కార్డు జారీ చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. నమోదు, కార్డుల జారీ ప్రక్రియకు రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. సంక్షేమ పథకాలు, పంట నష్టం, బీమా పరిహారం, రైతులకు అందించే వివిధ సేవల కోసం ప్రత్యేకంగా కార్డును జారీ చేయనున్నారు. పొలం కలిగిన ప్రతి ఒక్కరికీ ఫార్మర్ రిజిస్టర్ పేరుతో నిర్దిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలను సులభంగా, పారదర్శకం గా నేరుగా రైతులకు అందించేందుకు కార్డులు ఉపయోగపడనున్నాయి. పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులందరికీ ఈ గుర్తింపు కార్డు జారీ చేసే లక్ష్యంగా నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సంఖ్య ప్రామాణికం కానున్న నేపథ్యంలో రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పల్నాడు జిల్లాలో 2.59 లక్షల మంది, బాపట్ల జిల్లాలో 1.92 లక్షలు, గుంటూరు జిల్లాలో 1.26 లక్షల మంది రైతుల పేర్లను ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసే ప్రక్రియను వ్యవసాయ శాఖ ప్రారంభించింది. రైతులు తగు ధ్రువ పత్రాలతో వివరాలు నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందాలని పల్నాడు జిల్లా జేడీ మురళి సూచించారు. భూమి కలిగిన ప్రతి రైతూ ముందుకొచ్చి విశిష్ట సంఖ్య కోసం వివరాల నమోదుకు వ్యవసాయ శాఖకు రైతులు సహకరించాలని కోరారు.

నమోదు ఇలా..

రైతులకు గుర్తింపు కార్డు జారీ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతు సేవా కేంద్రాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి. ఆధార్, పట్టాదారు పుస్తకాల జిరాక్స్‌లను గ్రామ వ్యవసాయ సహాయకుడికి అందించాలి. ఆ వివరాలను వీఏఏ ఆన్‌లైన్లో నమోదు చేస్తారు. రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నెంబర్ వీఏఏ లాగిన్ ద్వారా వివరా లను సరిచూస్తారు. పట్టాదారు పాసుపుస్తకాల్లో ఉన్న వివరాలు సరిపోలితే 11 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డును సంబంధిత రైతు పేరిట నమోదు చేస్తారు. ఒకవేళ రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోతే వీఆర్వో లాగిన్‌కు వెళ్తుంది. వీఆర్వో దానిని పరిశీలించి తహసీల్దార్‌కు వివరాలు అందజేస్తారు. తప్పులు ఉంటే రికార్డుల మేరకు సరిచేసిన తర్వాత వీఏఏకు పంపిస్తారు. ఆ తర్వాత నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.



పల్నాడు జిల్లాలో గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేడీ మురళి

ప్రయోజనాలు..

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు ద్వారా ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయి. పీఎం కిసాన్ చెల్లింపులు, రైతు సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, వ్యవసాయ పరికరాలు తదితరాలను రైతు నేరుగా పొందే అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే సత్వరమే పరిహారం అందించేందుకు అవకాశం ఉంటోంది. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి సేవలు పొందవచ్చు. వాతావరణంలో మార్పులపై రైతులకు ఎప్పు టికప్పుడు సమాచారాన్ని అందించి అప్రమ త్తం చేసేందుకు ఈ కార్డులు ఉపయోగపడనున్నాయి.

మండలి ప్రచారంలో.. కూటమి జోరు

అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఎమ్మెల్యేలకు బాధ్యతలు

- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా నేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్
- సమన్వయంతో పని చేసి ఆలపాటిని గెలిపించాలని దిశా నిర్దేశం
- నేడు విజయవాడలో సమావేశం అవుతున్న జనసేన నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికల ప్రచారంలో ఎన్‌డీఏ కూటమి స్పీడు పెంచింది. ఇప్పటికే అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా బాధ్యతలు తీసుకున్న కూటమి ఎమ్మెల్యేలు, ఇతర నేతలు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీకి కూడా శ్రీకారం చుట్టారు. కాగా సీఎం చంద్రబాబునాయుడు రెండు జిల్లాల నేతలతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలు మరో 10 రోజుల్లోకి వచ్చేసినందున టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు నిత్యం ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచా లన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో నేతలు తమ నియోజకవర్గాల పరిధిలో డోర్ టూ డోర్ ప్రచారాలను ప్రారం భించారు. ఓటరు స్లిప్పులు పంచు తూ నేరుగా పట్టభద్రుల ఓటర్ల ను కలుసుకుం టున్నారు. తాము ఏమే మి చేయ బోయేది వివరించి చెబు



యూనివర్సిటీ వద్ద రెయిన్ ట్రీ పార్కులో ప్రచారంలో పాల్గొన్న ఉమ

తున్నారు. కాగా ఇప్పటివరకు అంతంత మా త్రంగానే ప్రచారంలో ఉన్న జనసేన, బీజేపీలు కూడా సోమవారం నుంచి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించ బోతున్నాయి. మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన సోమవారం విజయవాడలో జనసేన సమావేశం ఏర్పాటు చేసింది. అలానే బీజేపీ నాయకులు కూడా సమావేశమై కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం ప్రచారంలోకి దిగనున్నారు. సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. నేతలు కూటమి ధర్మాన్ని పాటిస్తూ విజయం కోసం కష్టపడాలన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలో అన్ని అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. మెజార్టీలు కూడా భారీగా వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ ఎన్నికల్లో కంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజార్టీ మరింత మెరుగ్గా రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు కూటమిపై నమ్మకం ఉండటం వల్లే సార్వత్రిక ఎన్నికల్లో 93 శాతం స్ట్రయిక్ రేట్ ఇచ్చారన్నారు. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామని, గత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో పెట్టిన రూ.780 కోట్లు చెల్లించామని, ఉద్యోగులు, పింఛన్‌దారులకు ప్రతీ నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామన్న అంశాలను

ముగ్గుర్ని కబళించిన ట్యాంకర్



- నెమలిపురి వద్ద రోడ్డు ప్రమాదం
- ప్రమాదంలో తల్లీ, ఇద్దరు కుమారులు మృతి
- హైదరాబాద్ నుంచి కారులో చీమకుర్తికి వస్తుండగా ఘటన

రాజుపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వారంతా ఒకే కుటుంబ సభ్యులు. హైదరాబాద్‌లో పిల్లలు ఉద్యోగం చేస్తుండగా వారితో కలిసి తల్లి ఆనందంగా జీవనాన్ని సాగిస్తున్నది. వారిని చూసి విధికి కన్ను కుట్టిందేమో ట్యాంకర్ రూపంలో మృత్యువు కబళించింది. భర్తకు కిడ్నీ దానం చేసి బతికించుకున్న భార్య.. తల్లి దండ్రులను జాగ్రత్తగా చూసుకుంటున్న కుమారులతో ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం పెనువిపత్తు సంభవించింది. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ నజీమ(46)కు భర్త, ఇద్దరు కుమారులు. కాగా పెద్ద కుమారుడు షేక్ నూరుల్లా(26), చిన్న కుమారుడు షేక్ హబీబుల్లా(24) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా హైదరాబాదులో ఉద్యోగం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు వారితోనే కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో నూరుల్లా భార్య నస్రీన్ గర్భిణీ కావడంతో సీమంతానికని హైదరాబాద్ నుంచి సొంత కారులో తల్లి, సోదరుడుతో కలిసి ప్రకాశం జిల్లా పెద్దకొత్తపల్లికి బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారిపై రాజుపాలెం మండలం నెమలిపురి వద్దకు వీరు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఆపై అతివేగంగా వచ్చి కారుపై పడింది. దీంతో కారు నుజ్జునుజ్జవగా అందులోని నజీమ, హబీబుల్లాలు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నూరుల్లాను చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై రాజుపాలెం ఎస్‌ఐ వేణుగోపాల్ కేసు నమోదు చేశారు.



నజీమా, షేక్ హబీబుల్లా



నుజ్జునుజ్జయిన కారు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కె శ్రీనివాసరావు

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

నెమలిపురి శివారులో జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డీటీవో సంజయ్ కుమార్, పిడుగురాళ్ల ఎంవీఐ రాంబాబు, హైవే ఇంజనీర్ రామ కృష్ణలతో కలిసి పరిశీలిం చారు. ప్రమా దానికి గల కారణాలను సత్తెనపల్లి రూరల్ సీఐ సుబ్బారావు, రాజుపాలెం ఎస్‌ఐ వేణుగోపాల్ ఎస్పీకి వివరిం చారు. గంటకు పైగా సం ఘ ట నా స్థలం వద్ద ఉండి ప్రమాదాల నివా రణకు ఎలాంటి చర్యలు చేపడితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయోనని ఎస్పీ అధికారులతో చర్చించారు. మూలమలుపు ప్రాంతాల్లో బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో వాహనాలను తనిఖీ చేసి మద్యం తాగిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

గుంటూరులో.. ఇద్దరు మృతి


● ట్యాంకర్ ఢీకొని వృద్ధురాలు.. డివైడర్‌ను ఢీకొని యువకుడు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ఆదివారం ఒక్కరోజు రెండు ప్రమాద దుర్ఘటనలు చోటుచేసుకోగా ఇద్దరు మృతి చెందారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ ట్యాంకర్ ఢీకొని దంటు కమల(70) అనే వృద్ధురాలు మృతి చెందగా, ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని చింతా రాము(20) అనే మరో యువకుడు మృతి చెందాడు. ప్రమాదాలకు సంబంధించి వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపిన వివరాలు.. పట్టాభిపురం రెండో లైన్‌కి చెందిన కమల అనే వృద్ధురాలు స్థానికంగా సాయి సునంద అపార్ట్మెంట్లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం ఆమె పట్టాభిపురం మెయిన్ రోడ్డులో పాలు పాలు తీసుకుని ఇంటికి వెళుతుండగా పెట్రోల్ బంకులో నుంచి వచ్చిన సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనం ఆమెను ఢీకొట్టింది. దీంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాదులో ఉంటున్న ఆమె మరిది కృష్ణప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

● అరండల్‌పేట మెయిన్ రోడ్డుపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో డెలివరీ బాయ్ చింతా రాము మృతి చెందాడు. బాపట్ల జిల్లా చినగంజాం మండలం పెద్దపల్లెపాలెం గ్రామానికి చెందిన చింతా రాము అమరావతి రోడ్డులో ఉంటూ కొత్తపేటలోని కుగ్లర్ ఆస్పత్రి పక్కన ఉన్న ఓ డెంటల్ క్లినిక్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నారు. అతడు బ్రాడీపేటలో డెలివరీ ఇచ్చి తిరిగి ఆస్పత్రికి వెళుతుండగా అరండల్‌పేట మెయిన్ రోడ్డుపై ఆరోలైన్ వద్ద మీదకు వస్తున్న ఆటోని తప్పించేందుకు ప్రయత్నించగా డివైడర్‌ను ఢీకొట్టాడు. డివైడర్‌పై పడిన రాముకు ఇనుప రైలింగ్ బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

గుర్తు తెలియని వాహనాలు ఢీ..

దేచవరం వద్ద విద్యార్థి.. రేమడిచర్లలో యువకుడు మృతి



సుమంత్ (పాత చిత్రం)

నకరికల్లు, బొల్లాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటనలు నకరికల్లు, బొల్లాపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గి మండలం అడిగొప్పుల గ్రామానికి చెందిన వేల్పూరి నాగేశ్వరరావు కసుకుర్తి సుమంత్ బైక్‌పై నరసరావుపేటకు వస్తున్నారు. నకరికల్లు మండలం దేచవరం మిద్దెకు ఒక కిలో మీటరు దూరంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం నాగేశ్వరరావు, సుమంత్‌లు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమంత్(16) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును పోలీసులు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. మృతుడు సుమంత్ తండ్రి కుసుకుర్తి నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేశారు. సుమంత్ నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల, రావులాపురం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని నల్గొండ జిల్లాకు చెందిన చిన్న(25) అనే యువకుడు మృతి చెందాడు. నల్గొండ జిల్లా గణేష్ నగరానికి చెందిన చిన్న బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడులో మిరప కూలి పనులకు వచ్చాడు. రావులాపురం - రేమిడిచర్ల మధ్యలో బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ఆనందబాబుకు ఓటరు స్లిప్ అందిస్తున్న టీడీపీ నేతలు

ఆలపాటిని గెలిపించుకుందాం

● వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆదివారం కూటమి నేతలు గ్రాడ్యుయేట్ ఓటర్లకు ఓటు స్లిప్పులు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆనందబాబుకి కూడా వారు ఓటరు స్లిప్పుని అందజేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ 53వ డివిజన్‌లోని ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు వద్దకు ఒకటికి రెండు మూడు సార్లు వెళ్లి కలిసి, వారితో మాట్లాడి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఓటువేసేలా చూడాలన్నారు. మద్దిరాల మ్యాని మాట్లాడుతూ ఆలపాటి రాజా గెలుపుకోసం పట్టుదలగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుడిమెట్ల దయారత్నం గొట్టిపాటి బాబు, పోదిలి వెంకటేశ్వర్లు, రసూల్, కోకా బాలాజి, నాయుడు మధు పాల్గొన్నారు..

బడ్జెట్‌లో బీసీలకు తగిన కేటాయింపులు చేయాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వానికి అండదండలుగా ఉన్న బీసీల కోసం బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఆదివారం తెనాలిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మొత్తం బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లను బీసీలకు కేటాయించేలా చూడాలని, బీసీ కులాల కార్పొరేషన్లను, ఆయా నిధులతో బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విదేశాలకు వెళ్లే బీసీ విద్యార్థులకు గతంలో మాదిరిగా రూ.10 లక్షలు సాయం పునరుద్ధరించాలని కోరారు. బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని, వివిధ వృత్తుల్లో ఉన్న వారికి పెన్షన్ ఇవ్వాలని, స్థానిక సంస్థలు నామినేటెడ్ పదవులలో 34 శాతం రిజర్వేషను కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. మద్యం దుకాణాలలో 10 శాతం గీత కార్మికులకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి శంకరరావు ధన్యవాదాలు తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం ఆదివారం నాటికి 538.60 అడుగులు ఉంది. ఇది 185.43 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమకాలువ ద్వారా 8718 , ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్ఎల్‌సీ ద్వారా 280, మొత్తం ఔట్‌ఫ్లో 20,998 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

ఐస్ స్కేటింగ్ ఎంపిక పోటీలపై రగడ

● ఒక్కో క్రీడాకారుడి నుంచి రూ. 1500 వసూలు
● అనుమతి లేదని స్టేడియం అధికారుల అడ్డగింత
● నగరంలోని వివిధ ప్రాంతాలకు పరుగులు
● ఆగ్రహం వక్తం చేసిన తల్లిదండ్రులు
● పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు



అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని బ్రహ్మానందరెడ్డి (బీఆర్) స్టేడియంలో ఆదివారం ఐస్ స్కేటింగ్ రాష్ట్ర స్థాయి ఎంపికల కార్యక్రమం నిర్వహణలో వివాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఆర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ సభ్యులు ముందుగా ప్రకటించారు. ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు 400 మందికి పైగా చిన్నారులు హాజరయ్యారు. అసోసియేషన్ సభ్యులు ప్రతి క్రీడాకారుని వద్ద రూ.1500 చొప్పున మొత్తం రూ.6 లక్షలపైగా వసూలు చేశారు. సరిగ్గా పోటీలు నిర్వహించే సమయంలో అనుమతి లేదని బీఆర్ స్టేడియం సిబ్బంది తెలిపారు. దీంతో వేదికను పాటిబండ్ల సీతారామయ్య స్కూలుకి మార్చారు. అక్కడ సరైన స్కేటింగ్ రింగ్ లేకపోవటంతో మిర్చియార్డు సమీపంలో వై జంక్షన్ వద్ద ఉన్న చిన్నపాటి స్కేటింగ్ రింగ్ వద్దకు మార్చారు.

ఈ పరిణామాలతో అసోసియేషన్ సభ్యులపై చిన్నారుల తల్లిదండ్రులు, కోచ్‌లు కొంతమంది ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉదయం నుంచి 400 మంది చిన్నారులను నగరం మొత్తం తిప్పుతున్నారని, అసలు ఐస్ లేకుండా స్కేటింగ్ ఎంపికలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీనిపై నిర్వాహకులు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వారంతా నల్లపాడు పోలీసులను ఆశ్రయించారు.

వివరాలు తెలుసుకున్న పోలీసులు నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంతపెద్ద ఈవెంట్ చేస్తున్నప్పుడు అనుమతి ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. ఇంత పెద్ద మొత్తంలో నగదు ఎందుకు వసూలు చేశారని ప్రశ్నించారు. ఈ విషయాలపై సోమవారం ఉదయాన్నే స్టేషన్‌కు వచ్చి సరైన వివరణ ఇవ్వాలని లేదంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

ఫెడరేషన్‌కు ఫిర్యాదు చేస్తాం ..

గుంటూరులో ఐస్ రోలర్స్ స్కేటింగ్ పేరుతో పోటీలు నిర్వహిస్తున్న వారిపై ఢిల్లీస్థాయిలో ఫెడరేషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్కేటింగ్ అసోసియేషన్ ట్రెజరర్ జే హరిబాబు తెలిపారు. కొన్ని పాఠశాలలోని పీడీలతో నిర్వాహకులు కుమ్మక్కై డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ఇలా చేస్తున్నారన్నారు. నార్త్ ఇండియాలోని హిమపాతాలలో ఐస్ స్కేటింగ్‌ను నిర్వహిస్తారని, సౌత్ ఇండియాలో నిర్వహించడం అసాధ్యమన్నారు. ఇలాంటి మోసాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హరిబాబు సూచించారు.

సీహెచ్‌వో హోదాను ఎంహెచ్‌వోగా మార్చాలి

● ఆరోగ్య విస్తరణాధికారుల, సామాజిక ఆరోగ్య అధికారుల రాష్ట్ర కార్యవర్గం డిమాండ్



సమావేశంలో ప్రసంగిస్తున్న శేషగిరిరాజు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్య అధికారి (సీహెచ్‌వో) హోదాను మండల ఆరోగ్య అధికారిగా(ఎంహెచ్‌వో) మార్చాలని ఆరోగ్య విస్తరణాధికారుల, సామాజిక ఆరోగ్య అధికారుల రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. ఆదివారం గుంటూరు ఎన్జీవోస్ హోమ్‌లో వైద్య ఆరోగ్యశాఖ విస్తరణాధికారుల, సామాజిక ఆరోగ్య అధికారుల రాష్ట్రకార్యవర్గ సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.పురుషోత్తమ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎన్జీవోస్ అధ్యక్షుడు ఘంటశాల శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ నర్స్‌తో పాటు సమానంగా ఆరోగ్య విస్తరణాధికారులకు వేతనంఇవ్వాలని, ఆరోగ్య విస్తరణాధికారులకు సామాజిక ఆరోగ్య అధికారులుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి ఫీల్డ్ లెవెల్ లోనూ ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని పోస్టులను జనాభా ప్రాతిపదికగా 14కి పెంచాలని తీర్మానాలుచేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శేషగిరి రాజు, జిల్లా అధ్యక్షుడు టి.సాంబయ్య తదితరులు ప్రసంగించారు.



జేసీబీ ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్

అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ దాడులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలంలోని చౌడవరం గ్రామంలో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. చౌడవరం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 104లో ఆడిటర్ గోపీ కృష్ణ అనే వ్యక్తి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నట్టు పలువురు రైతులు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు దాడులు చేసి మైనింగ్ కోసం వినియోగిస్తున్న జేసీబీ స్వాధీనం చేసుకుని నల్లపాడు పోలీసులకు అప్పగించారు. ఈదాడుల్లో విజిలెన్స్ సీఐలు చంద్రశేఖర్, శివాజీ, ఏవో ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేనమామ దారుణ హత్య

● భార్యని కాపురానికి పంపలేదని కత్తితో దాడిచేసిన అల్లుడు

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): భార్యని కాపురానికి పంపడం లేదన్న కక్షతో మేనమామను దారుణంగా హత్య చేసిన ఘటన ఆదివారం తెనాలిలో చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చినరావూరుకు చెందిన షేక్ రబ్బాని(40) తన మేన కోడలు కరీమాకి పినపాడుకు చెందిన షేక్ గౌస్‌బాజీ(బడే)తో 12ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు సంతానం. గౌస్‌బాజీ కొంతకాలంగా మద్యానికి బానిసై భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో భర్త వేధింపులు తాళలేక కరీమా పిల్లలతో సహా పుట్టింటికి వచ్చింది. భార్యను కాపురానికి రావాలని కోరుతూ గౌస్‌బాజీ ఆదివారం అత్తగారింటికి వచ్చాడు. మద్యం మానేసి, సక్రమంగా ఉంటేనే కరీమాను కాపురానికి పంపుతామని మేనమామ రబ్బానీ తెలిపారు. దీంతో రబ్బానీపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ గౌస్‌బాజీ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం సాయంత్రం గౌస్‌బాజీ చెంచుపేటలో పండ్లవ్యాపారం చేస్తున్న రబ్బాని వద్దకువచ్చి కత్తితో పొడిచి పరారయ్యాడు. రబ్బాని తీవ్రరక్తస్రావంతో కుప్పకూలిపడిపోయాడు. స్థానికులు అతడిని తెనాలి ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రబ్బాని మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు.

నేటి నుంచి ఆర్వీఆర్‌జేసీలో

జాతీయ అంకుర పరిశ్రమల క్యాంపు

● ఏర్పాట్లు పరశీలించిన ఏఐసీటీఈ బృందం



కళాశాలలో పర్యటిస్తున్న ఏఐసీటీఈ బృంద సభ్యులు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి):ఏఐసీటీఈ (అఖిల భారత సాంకేతిక విద్యామండలి), మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్‌కౌన్సిల్ సంయుక్త సహకారంతో, సౌత్ ఇండియా రీజియన్ పరిధిలో సోమవారం నుంచి ఈనెల 21వ తేది వరకు ఆర్వీఆర్‌జేసీలో జరగనున్న ఇన్నోవేషన్ డిజైన్, ఎంటర్‌ప్రెన్యూర్ బూట్ క్యాంపు కార్యక్రమ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏర్పాట్లు పరిశీలించేందుకు ఏఐసీటీఈ పరిశీలకులు డాక్టర్ ఇంజ నాగ భీమలింగేశ్వర్‌రెడ్డి, అధికార బృందం సభ్యులు ఆదివారం కళాశాలను సందర్శించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న విద్యార్థులు వారు రూపొందించిన వివిధ రకాల నూతన ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు అనువైన సాంకేతిక సౌకర్యాలు, వసతి ఏర్పాట్ల పట్ల ఏఐసీటీఈ అధికార బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్, ఆర్ అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వి. శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవిపి చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో 4.9 కిలోల బంగారం దోపిడీ

● చోరీ జరిగిన తీరుపై పలు అనుమానాలు
● సంఘటన స్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్ట్ చేసిన పోలీసులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో శనివారం రాత్రి భారీ దోపిడీ జరిగింది. ఏకంగా రూ.కోట్ల విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును దుండగులు అపహరించారు. ఈ ఘటనకు సంబంధించి మంగళ గిరి రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళగిరి ఆంజనేయ కాలనీకి చెందిన దివి రాము విజయ వాడలో ఓ జ్యూయలరీ దుకాణం నిర్వహిస్తున్నారు. రాము వద్ద పనిచేస్తున్న సమీప బంధువు దివి నాగరాజు సుమారు 4.9 కిలోల బంగారు ఆభరణాలను స్కూటీకి ముందు తగిలించుకుని శనివారం రాత్రి మంగళగిరి బయల్దేరాడు. ఆత్మకూరు అండర్ పాస్ దాటి మలుపు తిరిగిన అనంతరం వెనుక నుంచి స్పోర్ట్స్ బైకుపై వచ్చిన ఇద్దరు బంగారు ఆభరణాల సంచిని లాక్కుని పరారైనట్టుగా నాగరాజు బంధువు లకు ఫోను చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో సమాచారం అందుకున్న డీఎస్పీ మురళీకృష్ణ, మంగళగిరి రూరల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకుని దోపిడీ జరిగిన తీరును పరిశీలించారు. నాగరాజును, అతడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసు కుని పలు కోణాల్లో విచారిస్తున్నారు. దోపిడీ జరిగిన గంటకు ముందు అతను ఎవరెవరితో మాట్లాడాడో వివరాలు సేకరించారు. చుట్టుపక్కల సీసీ కెమేరాలను పరిశీలిస్తున్నారు. అయితే, చోరీ జరిగిన తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు రూ.4 కోట్ల విలువచేసే బంగారు ఆభరణాలను అత్యంత నిర్లక్ష్యంగా స్కూటీకి తగిలించుకుని వెళ్లడం, రాత్రి 9 గంటల సమయంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన దుండగులు బ్యాగు లాక్కుని పారిపోయారని చెప్పడం, పోలీసుల విచారణలో స్థానికులు అలాంటి ఘటనేమీ తాము చూడలేదని చెప్పడం వంటివి వారి అనుమానాలకు మరింత బలం చేకూరుతుంది.

రైలు ఢీకొని మహిళ మృతి

● పట్టాలు దాటుతుండగా ఢీకొట్టిన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెక్స్ రైలు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో కొలకలూరు రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం ఉదయం రైలు ఢీకొని మహిళ మృతి చెందింది. జీఆర్‌పీ ఎస్ఐ వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. గుడివాడకు చెందిన బొద్దులూరి పద్మావతి (55) ఒంగోలులో జరుగుతున్న బంధువుల వివాహానికి వెళ్లేందుకు గాను ఆదివారం ఉదయాన్నే విజయవాడ-ఒంగోలు ప్యాసింజర్ ఎక్కటానికి కొలకలూరు రైల్వే స్టేషన్‌కు వచ్చింది. రైల్వే స్టేషన్ వద్ద అవతలి వైపు వెళ్లేందుకు ఆమె రైలు పట్టాలు దాటుతుండగా విజయవాడ వైపు వెళుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆమెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే పద్మావతి మృతి చెందింది. ఉదయాన్నే రైల్వే స్టేషన్ ఆవరణలో దట్టంగా పొగమంచు కమ్మి ఉంది. రైలు ఎక్కాలని హడావుడిలో పట్టాలు దాటుతున్న పద్మావతికి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకను గుర్తించకపోవడం వలన ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00



సాయిసాధన చిట్ ఫండ్ భాదితుల సమావేశంలో మాట్లాడున్న సి.ప్రతాప్

సాయి సాధన చిట్ ఫండ్ బాధితుల సమావేశం

● రాజీ మార్గంగా సమస్య పరిష్కరించుకుందామని వెల్లడి
● బాధితులంతా ఒక కమిటీగా ఏర్పడాలని నిర్ణయం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని రావిపాడు రోడ్డులో సమీపం వద్దగల కమ్మ విద్యార్థి వసతి గృహం ఆవరణలో ఆదివారం సాయి సాధన చిట్ ఫండ్ బాధితులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాది సీ.ప్రతాప్ మాట్లాడుతూ చిట్ ఫండ్ అధినేత పాలడుగు పుల్లారావు బాధితులు ఇప్పటి వరకు 513 మంది ఉన్నారని, వారందరికీ దాదాపు రూ.108 కోట్లు పుల్లారావు ఇవ్వవలసింది ఉందన్నారు. ఇంకా భాదితులు ఉండొచ్చని, వారి వివరాలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం తమ వద్ద వున్న సమాచారం మేరకు పుల్లారావు ఆస్తుల విలువలను అంచనా వేస్తే దాదాపుగా రూ.100 కోట్ల వరకు ఉందన్నారు. బాధితులంతా ఒక కమీటిగా ఏర్పడి సమస్యను పరిష్కరించుకుందామని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందు కోసం పుల్లారావు తరపు వారికి సమాచారం పంపామన్నారు. ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహించడానికి ఓ వైద్యుడు సుముఖత వ్యక్తం చేశారన్నారు. ఒక వేళ ఈ చర్చలు విఫలం అయితే న్యాయపరంగా ముందుకు వెళతామని స్పష్టం చేశారు. కడియాల రమేష్, ఈఎం స్వామి మాట్లాడుతూ ఈ రాజీ మార్గాన్ని ఒక అవకాశంగా భావించి సమస్యను పరిష్కరించుకుందామన్నారు.



చింతల రామలింగేశ్వర స్వామి గేటు వద్ద పడివున్న శాసనాన్ని పరిశీలిస్తున్న సతీష్‌బాబు

చారిత్రక శాసనాలను పరిరక్షించుకోవాలి

● చరిత్ర పరిశోధకుడు, రచయిత సతీష్‌బాబు
● పొలం గట్టుపై, ఆలయం మెట్లపై ముక్కలుగా పడివున్న రుద్రమదేవి కాలం నాటి శిలా శాసనం

మాచర్లటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యానికి గురైన కాకతీయ మహారాణి రుద్రమదేవి కాలం నాటి శాసనాన్ని పరిరక్షించుకోవాలని చరిత్ర పరిశోధకుడు, రచయిత సతీష్‌బాబు అన్నారు. పట్టణం నుంచి జమ్మలమడక రహదారికి వెళ్లే రహదారిలో ఉన్న చింతల రామలింగేశ్వరస్వామి గేటు వద్ద పొలం గట్టుపై విరిగిన శాసనబండను సతీష్‌బాబు ఆదివారం గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనబండలో ఒక భాగం పొలం గట్టు వెంబడి పడి ఉందని, దీని తాలూకా మరో అవశేషం దేవాలయ ఆవరణలోని అరుగుపై నిర్లక్ష్యంగా పడి ఉందన్నారు. ఈ శాసనం శాలివాహన శకం 1210 సర్వధారి వైశాఖ శు 15, క్రీ.శ. 1288 ఏప్రిల్ 18న ప్రతిష్ఠించినట్లు చెప్పారు. రుద్రమదేవి సేవకుడు బొల్నాయిని కుమారుడైన మల్లికార్జున నాయకుడు శ్రీశైలం రామనాథదేవర అంగరంగభోగాలకు మెట్ట, మాగాణి భూములను దానంగా ఇచ్చినట్లు శాసనంలో ఉందని తెలిపారు. ఈ శాసనాన్ని పురావస్తు శాఖ అధికారులు 1942లో నకలు తీశారని, ఆ తరువాత నిర్లక్ష్యానికి గురై శాసనం రెండు, మూడు ముక్కలుగా పగిలిపోయిందన్నారు. పొలం గట్టు వద్ద ఉన్న విరిగిన శాసన బండను, దేవాలయ ఆవరణలోని అరుగుపై నిర్లక్ష్యంగా పడి ఉన్న మరో బండను ఒక్క చోటకు చేర్చి ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించి వారసత్వ సంపదను కాపాడాలని దేవాలయ కమిటి సభ్యులను కోరారు. సతీష్‌బాబు వెంట ఉప్పుతోళ్ల రమేష్, ఓరుగంటి చెన్నకేశవరావు ఉన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



లింగయ్య(ఫైల్)

ఫిరంగిపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండ్రిక గ్రామానికి చెందిన తుపాకుల లింగయ్య(41) కొన్నేళ్లుగా ఎనిమిది ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగుచేస్తూ, నష్టపోయి సుమారు రూ. 16 లక్షలు అప్పులపాలై చివరికి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచే సుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుపాకుల లింగయ్య తాను సాగు చేసే పొలంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గ్రామస్థులు గుర్తించారు. విషయం తెలుసుకున్న బంధువులు ఘటనా స్థలానికి వెళ్లి లింగయ్యను నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. లింగయ్యను పరీక్షించిన వైద్యులు మార్గ మధ్యంలోనే మృతిచెందాడని తెలిపారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కుమారుడు వాసు, కుమార్తె శ్రీవాణి ఉన్నారు. ఫిరంగిపురం ఎస్ఐ బి.రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రాజగోపాల్ నగర్, మంగళదాస్ నగర్, సీతారామ కాలనీ, బీటీఆర్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రవీంద్రనగర్, శ్యామలానగర్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

19న శోభాయాత్ర

గుంటూరు(తూర్పు)ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శివాజీ మహారాజ్ 395 జయంతి సందర్భంగా ఈనెల 19వ తేదీన గుంటూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు హిందూ చైతన్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వంగా నవీన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శోభాయాత్ర ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు స్థానిక హిందూ కళాశాల సారిక మైదానం నుంచి ప్రారంభమై కొరిటెపాడు, శివాజీ మైదానం వరకు కొనసాగుతుందన్నారు.

ముగిసిన ఇంటర్‌స్కూల్ ఫుట్‌బాల్ పోటీలు


విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ సొగంధ్

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పొత్తూరు సమీపంలోని ఏసీఎంఈ స్కూల్‌లో ఇంటర్ స్కూల్ ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయని డైరెక్టర్స్ దీప్తి,సొగంధ్ నందమూరి ఆదివారం తెలిపారు. అండర్-14 విభాగంలో కొర్రపాడు టీమ్ బంగారు పతకాలు సాధించగా డిలీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వెండి, ఏసీఎంఈ స్కూల్ విద్యార్థులు రజిత పతకాలు కైవసం చేసుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా రోహన్ కృష్ణ నిలిచాడు. అండర్-12 విభాగంలో ఏసీఎంఈ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు, డీపీఎస్ విద్యార్థులు వెండి, సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు రజిత పతకాలు సాధించారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ


త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తున్న డీవీఆర్ సీత

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ కళావేదికపై విశ్వనాథ సాహిత్య అకాడమీ, గుంటూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాజ నీరాజనం కార్యక్రమంలో విదుషి డీవీర్ సీత గాత్ర కచేరీ జరిగింది. త్యాగరాజ కీర్తన నిన్నే భజన అనే కీర్తనతో ప్రారంభించి, బంటురీతి కొలువీయవయ్యా రామ, పలు వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. వయోలిన్‌పై వారణాసి శ్రీకృష్ణ రాఘవ, మృదంగంపై బీ సురేష్ బాబు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్‌వై శేషురాణి, ప్రముఖ సాహిత్యవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లు, నేతి విశ్వేశ్వరరావు పాల్గొని కళాకారులను అభినందించారు.

కుటుంబ పెన్షన్‌కు ఆధార్‌లో నమోదు చేసుకోవాలి

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెన్షనర్ల మరణానంతరం కుటుంబ పెన్షన్ మంజూరు కావాలన్నా, వారికి వయస్సు రీత్యా వచ్చే అదనపు పెన్షన్ రావాలన్నా, వయస్సు నిర్ధారణ, ఇంటి పేరు వివరాలు సక్రమంగా ఆధార్ కార్డులో నమోదై ఉండాలని పెన్షన్‌దారుల చర్చావేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈదర వీరయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పెన్షనర్లు మరణించినప్పుడు వారి కుటుంబ సభ్యులకు కుటుంబ పెన్షన్ మంజూరు కావాలన్నా అదనపు పెన్షన్ ఖచ్చితమైన తేదీకి మంజూరు కావాలన్నా అర్హత గల కుటుంబ సభ్యులు ఖచ్చితమైన వయస్సు నిర్ధారణ వివరాలు, తమ పుట్టిన ఇంటి పేరు కాకుండా మరణించిన పెన్షనర్ ఇంటి పేరుతో వివరాలు ఆధార్ కార్డులో నమోదై ఉండాలన్నారు. అలా కాకపోతే ప్రభుత్వం వారికి తోచిన వివరాలు తీసుకుని ఏది లాభదాయకంగా ఉంటే ఆ తేదీకి అదనపు పెన్షన్ మంజూరు చేస్తారన్నారు. చాలా మంది కుటుంబ సభ్యులకు వివాహం అయిన తరువాత కూడా పుట్టింటి పేరే ఆధార్ కార్డులో నమోదై ఉంటుందన్నారు. అటువంటి వారు వివాహం అయిన తరువాత పెన్షనర్ ఇంటి పేరునే తమ ఇంటి పేరుగా ఆధార్ కార్డులో నమోదు చేసుకోకపోతే కుటుంబ పెన్షన్‌కు అర్హత కల వారు ఇబ్బంది పడతారన్నారు.

హోమియో వైద్యంతో దీర్ఘకాలిక రోగాలకు పరిష్కారం

● డాక్టర్ మారుతీనందన్

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): హోమియో పతి వైద్యంతో తరుణ, దీర్ఘకాలిక రోగాలకు పరిష్కారం లభిస్తుందని డాక్టర్ ఉప్పాల మారుతీనందన్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవాళికి ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలన్నింటికీ హోమియో వైద్యంలో మందులున్నాయని, చిన్నా, పెద్దా అందరూ ఆరోగ్యంగా, ఆనందగా ఉండొచ్చని తెలిపారు. అతి తక్కువ వ్యయంతో ఆరోగ్యవంతుల్ని చేసే హోమియోపతిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ఆరోగ్యాన్ని కాపాడుతూ జబ్బులు రాకుండా చూసే మన ప్రాణశక్తి మీద పనిచేసేలా హోమియో మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. అనంతరం డాక్టర్ మారుతీనందన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇందుశేఖర్, పాపిరెడ్డి, శ్రీనివాసరావు తదితరులున్నారు.

వాసవీ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గత 25 ఏళ్లగా వృద్ధులకు, పేదలకు అండగా నిలబడుతున్న వాసవీ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం గౌరవ అధ్యక్షుడు


వృద్ధులకు బియ్యాన్ని పంపిణీ చేస్తున్న కొత్తూరు వెంకట నరసింహారావు తదితరులు


కొత్తూరు వెంకట నరసింహారావు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆతుకూరి నరసింహారావు అన్నారు. వాసవీ క్లబ్, మహిళా, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆర్.అగ్రహారం శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 108 మంది వృద్ధులకు ఉచిత బియ్యం, పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ క్లబ్ సేవలను మరింతగా విస్తృతం చేయాలని కోరారు. అనంతరం మెడికల్ కమిటీ చైర్మన్ శనగపల్లి శివ శంకరరావు ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత రక్త నాళాల వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాలకు వాసవీ క్లబ్ అధ్యక్షుడు రాయవరపు ఆశోక్‌కుమార్ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

● సెంట్రల్ లైటింగ్ నిర్వహణలో నిర్లక్ష్యం
● శివారు ప్రాంతాల్లో అంధకారం ● ఇదీ గుంటూరు- అనంతపురం జాతీయ రహదారిలో దుస్థితి

ఏటి అగ్రహారం (గుంటూరు విద్య), ఫిబ్రవరి 16: (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నిర్వహణలో నిర్లక్ష్యం, లోపాల కారణంగా శివారు ప్రాంతాలు అంధకారంలో మగ్గుతున్నాయి. ప్రధానంగా గుంటూరు-అనంతపురం జాతీయ రహదారి చుట్టగుంట వద్ద ప్రారంభం అవుతుంది. అయితే చుట్టుగుంట సెంటర్ నుంచి నల్లపాడు వరకు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదు. ఫలితంగా రాత్రిపూట శివారు ప్రాంతాల్లోని కొన్ని కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చుట్టుగుంట రైతు బజారు వద్ద, శ్రీరామ్‌నగర్ బస్టాప్, మిర్చియార్డు, హౌసింగ్ బోర్డుకాలనీ, నల్లపాడు, అంకిరెడ్డిపాలెం అడ్డరోడ్డు తదితర ప్రాంతాల్లో డివైడర్స్ మధ్యలో ఉన్న లైట్లు పనిచేయడం లేదు. కనీసం మూడునెలలకు ఒకసారైనా పెట్రోలింగ్ నిర్వహించి లైట్లు పనిచేస్తున్నా యా? లేదా అనే విషయాలు సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయం గురించి ఇటు నగరపాలక సంస్థ అటు నేషనల్ హైవే అథార్టీ మధ్య నెలకొన్న సమన్వయలోపం ప్రజలకు సంకటంగా మారింది. లైట్లు పనిచేయకపోవడంతో శ్రీరామ్‌నగర్ బస్టాప్, చుట్టుగుంట అన్న క్యాంటిన్ వద్ద సీసీ కెమెరాలు ఉండీ ఉపయోగం లేన్నట్లు మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థలో లోపాలు సవరించాలని, లైట్లు పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


శివరామ్‌నగర్ భారత్‌పెట్రోల్ బంకు సమీపంలో అంధకారం


రామిరెడ్డినగర్ హిందూ శ్మశానవాటిక వద్ద దుస్థితి

డాక్టర్ కవితకు అరుదైన పురస్కారం

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా ప్రదానం

గుంటూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణ రంగంలో గణనీయమైన కృషి చేసినందుకు గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ముక్కు కవితకు అరుదైన పురస్కారం లభించింది. టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా హెల్త్ కేర్ అవార్డ్స్‌లో ఆమెకు చోటు దక్కింది. ఆదివారం విశాఖపట్నంలో అవార్డుల ప్రదానం జరిగింది. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మీదుగా చేతుల మీదుగా డాక్టర్ కవిత అవార్డును అందుకున్నారు. కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సతీమణి అయిన డాక్టర్ కవిత గుంటూరు జీజీహెచ్‌లో గ్యాస్ట్రో ఎట్రాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు కూడా ఆమె సుపరచితులు. ఆరోగ్య సంరక్షణ భవిష్యత్‌ను రూపొందించడంలో మెరుగైన పాత్ర పోషించినందుకు ఆమెకు అవార్డు ఇచ్చి నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కవిత కృషిని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రత్యేకంగా కొనియాడారు.


డాక్టర్ కవితకు అవార్డును అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రశ్నిస్తే.. వేధింపులు

సివిల్ సప్లయిస్ అధికారుల తీరుపై ఓ రైస్ మిల్లర్ ఆవేదన

విజయవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధికారులు తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాపట్లకు చెందిన వెంకటేశ్వర రైస్ ట్రేడర్స్ యాజమాని చిన్ని మోహన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంస్థలోని అధికారుల అరాచకాలను ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తాము సంస్థకు పలు దఫాలుగా సరఫరా చేసిన రూ. యాభై లక్షల విలువైన బియ్యాన్ని అకారణంగా ఉద్దేశపూర్వకంగా గత ఏడాది జనవరి 29న అధికారులు రిజెక్టు చేశారన్నారు. ఇప్పటి వరకు ఆ బియ్యాన్ని వారి ఆధీనంలో ఉంచుకున్నారన్నారు. 46 ఏళ్లుగా నిజాయితీ రైస్ మిల్లర్‌గా ఉన్న తనను బ్లాక్ లిస్టులో పెట్టారని ఆవేదన వ్యక్తంచేశాడు. సీఎంఆర్ పథకంలో తనను పాల్గొన కుండా తన ప్రతిష్ఠను మంటగలిపి ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు స్పందించి తనకు రావాల్సిన నగదును ఇప్పించాలని, విచారణ చేసి తప్పు చేసిన సంస్థ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిన్ని మోహన్‌రావు

చీటీపాటల డబ్బుతో తల్లీకొడుకు ఉడాయింపు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అమరావతిరోడ్డు మాలకొండయ్య కాలనీకి చెందిన విజయలక్ష్మి, ఆమె కుమారుడు అనిల్ కుమార్ అనే ఇరువురు ఎంతో కాలంగా చీటీపాటలు నిర్వహిస్తున్నారు. అయితే వారు సుమారు 40 మంది వద్ద నుంచి 15 లక్షల రూపాయలు చీటీ పాటల పేరుతో వసూలు చేసి తిరిగి ఇవ్వకుండా, ఎవరికీ చెప్పకుండా ఇల్లు ఖాళీ చేసి పారిపోయినట్లు ఆ కాలనీకి చెందిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరండల్‌పేటలో బ్యాగ్ స్నాచింగ్

గోరంట్లకి చెందిన సాయి పూజ అనే యువతి తన తల్లితో కలిసి అరండల్ పేట 5/5వ లైనులోని ప్రైవేటు హాస్పిటల్‌కి వెళ్ళి టెస్టులు సమయంలో ఆమె తల్లి మెడలోని బంగారు గొలుసు తీసి హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకొని రాత్రి 8 గంటల సమయంలో హాస్పిటల్ బయటికి వచ్చి పక్క షాపు వద్దకి నడుచుకుంటూ వెళుతోంది. స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెనక నుంచి వచ్చి ఆమె భుజానికి తగిలించుకుని ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను లాక్కొని పారిపోయారు. బ్యాగ్‌లో 20 గ్రాముల బంగారు గొలుసు, మొబైల్ ఫోన్, రూ. 1500 నగదు ఉన్నట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మస్తాన్‌సాయి నేరాలతో దర్గా అపవిత్రమవుతోంది

గవర్నర్ అబ్దుల్ నజీర్ కి లేఖ రాసిన లావణ్య తరపు న్యాయవాది

మస్తాన్‌సాయి నేరాల వల్ల మస్తాన్ దర్గా అపవిత్రమవుతోందని లావణ్య తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ కి లావణ్య తరపు న్యాయవాది లేఖ రాసారు. ఈ క్రమంలో మస్తాన్ దర్గాను ధర్మకర్తలుగా సాయి కుటుంబాన్ని తొలగించాలని ఆలేఖలో కోరారు. ప్రస్తుతం మస్తాన్ దర్గాకు మస్తాన్‌సాయి తండ్రి రామ్మోహన్‌రావు ధర్మకర్తగా ఉన్నారు.

దశావతార వెంకన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు


దశావతార వెంకన్న సన్నిధిలో జరిగిన పూజలో పాల్గొన్న భక్తులు

పెదకాకాని, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వరస్వామి వారి దివ్య క్షేత్రం లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయంలోని మహాగణపతి స్వామి వారికి సంకటహర చతుర్థి సందర్భంగా ఘనంగా వ్రతాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కర్‌రావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డాక్టర్స్ క్రికెట్ పోటీలు

పెదకాకాని, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న ప్రారంభించిన డాక్టర్స్ క్రికెట్ క్రీడా పోటీలలో డాక్టర్లు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నంబూరులోని డీవీఎస్ఏ క్రికెట్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లాల డాక్టర్స్ క్రికెట్ పోటీలో మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీలను ఆదివారం పోలవరం ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ శివకుమార్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ దావులూరి రమేష్ అందజేశారు. పోటీలలో ఎవన్‌జెర్స్, జీబీఆర్, శ్రీటీమ్, ప్రైమ్‌ప్రాస్పెస్, అమృత, ఐకాన్, ఏ1, జీబీఆర్ టీమ్‌లు గెలుపొందినట్లు డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి.ఎస్. రెడ్డి, డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. శ్రీటీమ్‌లో బెస్ట్ బౌలర్‌గా పృధ్వి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిమ్మకాయాల పృధ్వీ రాజ్ నిలిచారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

అస్తవ్యస్తంగా హౌసింగ్‌బోర్డు ఎక్స్‌టెన్షన్ రోడ్డు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగర శివారులోని హౌసింగ్ బోర్డు కాలనీ ఎక్స్‌టెన్షన్ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది. సాయిబాబాగుడి పక్క నుంచి సరాసరి వెళితే ఈ రోడ్డు ద్వారా నల్లపాడు వెళ్ళే వీలవుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ రోడ్డు గుంతలతో ఉండటంతో పాదాచారులే గాక వాహన చోదకులు కూడా నరకం అనుభవిస్తున్నారు. రోడ్డు అంతట గులకరాళ్ళు ఉండడంతో నిత్యం టైర్లకు పంచర్లు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు సరాసరి నల్లపాడు, పేరేచర్ల, సత్తెనపల్లి రోడ్డును కలుపుతుండటం వల్ల ఎక్కువమంది ఈ రోడ్డును వినియోగించుకుంటున్నారు. శ్యామలానగర్ రైల్వే గేటు నుంచి నల్లకుంట, హౌసింగ్ బోర్డు కాలనీ మీదుగా వాహనదారులు హైవే మీదుగా వెళుతున్నారు. వాహనాల రద్దీకి తోడు రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో ఈ రోడ్డులో ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ ఎక్స్‌టెన్షన్ రోడ్డులో కొన్ని రోజుల క్రితం గుంతల్లో గులక రాయి, డస్ట్ పోశారు. వర్షాల కారణంగా డస్ట్ పూర్తిగా కొట్టుకుపోయి గులక రాళ్ళు బయటికి వచ్చాయి. దీంతో వాహనదారులు తమ వాహనాలకు టైర్లు పాడై పోతున్నాయని, ఈ రోడ్డుకు సరైన రీతిలో మరమ్మతులు చేయించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. వాహనాలు వెళ్ళేటప్పుడు మట్టి పైకిలేస్తుందని దీనివల్ల డస్ట్ ఎలర్జీతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు వాహన చోదకులు అంటున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఈ రోడ్డును సీసీ రోడ్డుగానో లేదంటే తారు రోడ్డు గానో మార్చాలని స్థానికులు కోరుతున్నారు.


అస్తవ్యస్తంగా ఉన్న హౌసింగ్‌బోర్డు కాలనీ ఎక్స్‌టెన్షన్ రోడ్డు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రియాశీలకంగా పని చేయాలి

● జనసేన క్యాడర్‌కు బోనబోయిన సూచన



సమావేశంలో పాల్గొన్న జనసేన నేతలు బోనబోయిన, నాయబ్ కమల్ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల్లో జనసేన క్యాడర్ క్రియాశీలకంగా పని చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్ అన్నారు. ఆదివారం జనసేన గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో సోమవారం విజయవాడలో జరుగబోయే ఆరు జిల్లాల నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశంపై చర్చించారు. గుంటూరు జిల్లాకు ఎమ్మెల్సీ ఎలక్షన్ పరిశీలకుడిగా నియమితుడైన నాయబ్ కమల్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బోనబోయిన మాట్లాడుతూ సోమవారం మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి గుంటూరు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో హాజరు కావాలన్నారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా అక్కడికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, జిల్లా కమిటీ సభ్యులు, నగర కమిటీ సభ్యులు, వార్డు అధ్యక్షులు మరియు జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకుల అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగులది కీలకపాత్ర

● యూబీఐ జోనల్ హెడ్ సయ్యద్ జవహర్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల పురాభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగులు, అధికారులు కీలకపాత్ర పోషించారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ ఎస్ జవహర్ అన్నారు. స్థానిక బ్రాడీపేట పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం తెలుగు రాష్ట్రాల యూనియన్ బ్యాంక్



మాట్లాడుతున్న సయ్యద్ జవహర్, పాల్గొన్న విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు

రిటైరీస్ అసోసియేషన్ సమావేశం జరిగింది. సభకు అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల వెంకయ్య మాట్లాడుతూ ఐదు లక్షల కోట్ల రూపాయల పైగా టర్నవర్లో ఉన్న యూనియన్ బ్యాంక్ అభివృద్ధికి లక్షలాదిమంది ఉద్యోగులు అధికారుల శ్రమ ఉందన్నారు. విశ్రాంత ఉద్యోగుల ప్రధాన సమస్యలైన 1995 నుంచి పెన్షన్ అప్డేషన్ చేయాలన్నారు. మెడికల్ అలవెన్సులపై జీఎస్టీ 18 నుంచి 5శాతం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత యూబీఐ జోనల్ అధికారులు టీఎల్‌వీ రావు, డాక్టర్ కొసరాజు రవీంద్రనాథ్, ఈ పుల్లారావు, బీవీవీ కొండలరావు, ఏ యల్లారావు, ఎన్‌వీ రమణ, హరిబాబు పాల్గొన్నారు.

● నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం అసోసియేషన్ 2025-28 మూడేళ్ళకు గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ చైర్మన్‌గా పీబీ రాఘవేంద్రరావు, అధ్యక్షుడిగా ఏ వెంకయ్య, ఉపాధ్యక్షులుగా టీ వసంతాదేవి, పీసీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌వీ సుబ్బారావు, సహాయ కార్యదర్శులుగా ఎస్ఆర్ఎస్ శ్యామ్, షేక్ అన్వర్ ఖాసిం, కోశాధికారిగా లలిత అన్నపూర్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాకాని రోడ్డులో రెండు వర్గాల ఘర్షణ

● ఇద్దరికి తీవ్ర గాయాలు ● జీజీహెచ్‌కి తరలింపు


గాయపడ్డ గద్దె శివ కేశవ

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకాని రోడ్డులోని వాసవీ కాంప్లెక్స్ వద్ద రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పాత గుంటూరు పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు నెహ్రూ నగర్ జీరో లైనుకు చెందిన కుంచాల మని, గద్దె శివకేశవతో మరికొందరు ఒక వర్గంగా, ప్రభాకర్ అలియాస్ పండు శివ, మనీ అనే ముగ్గురుతో పాటు మరి కొంతమంది ఒక వర్గంగా ఏర్పడ్డారు. వీరంతా పెయింట్ పని చేసుకుని జీవిస్తుంటారు. పని చేసుకునే వద్ద చిన్న వివాదం రాగా తొలుత నెహ్రూనగర్ జీరో లైన్‌లో కొట్టుకున్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి కాకాని రోడ్డులోని వాసవీ కాంప్లెక్స్ వద్ద రెండు వర్గాలు సర్జికల్ బ్లేడ్స్‌తో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకే వర్గానికి చెందిన కుంచాల మని, గద్దె శివకేశవకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పాత గుంటూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. గాయాలైన ఇద్దరిని వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాత గుంటూరు సీఐ సోమయ్య పేర్కొన్నారు.


ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ప్రజారోగ్యానికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతి ఒక్కరూ కేటాయించిన పారిశుధ్య పనులకు ముందస్తు అనుమతులు లేకుండా గైర్హాజరయితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గుంటూరు నగరంలో పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులు ఎక్కువ మంది ముందస్తు అనుమతులు లేకుండా ఆదివారం విధులకు గైర్హాజరవడం తమ దృష్టికి వచ్చిందని, కార్మికులను ప్రలోభపెట్టి ప్రజారోగ్యానికి భంగం కల్గించడానికి కొంత మంది అనధికార వ్యక్తులు ప్రేరేపిస్తున్నారన్నారు. పనులకు ఆటంకం చేసే వారిపై తక్షణం విచారణ చేయిస్తున్నామన్నారు. విచారణ అనంతరం జీఎంసీ కార్మికులు అయితే క్రమశిక్షణ చర్యలు, అనధికార వ్యక్తులు అయితే చట్టపరంగా పోలీస్ కేసులు నమోదు చేయిస్తామని స్పష్టం చేశారు.

రమణీయ సందేశం రామాయణ కావ్యం

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రామాయణం రమణీయ సందేశ కావ్యం అని ఏపీ ప్రభుత్వ ఖజానా విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ నందిపాటి నాగేశ్వరరావు తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో 'అమరావతి సాహితీ మిత్రులు" ఆదివారం సాహిత్య సభ జరిగింది. ఈ సందర్భంగా అబ్దుల్ రజా హుస్సేన్ రచించిన 'వాల్మీకి రాయని రామాయణం' గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ విలువలకు, సంస్కృతికి పెద్దపీట వేసినది రామాయణ కావ్యం అని వాల్మీకిని కొనియాడారు. వక్కలంక వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో కవి అబ్దుల్ రజా హుస్సేన్ మాట్లాడుతూ ఇది రామాయణాన్ని విమర్శించే రచన కాదని, తాత్విక దృష్టితో పాత్రల్ని పరిశీలింప చేసేదన్నారు. సభలో గంగవరపు సునీత (చిలకలూరిపేట) ఈమాసం కవిగా పాల్గొని పలు కవితలను వినిపించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో శరకణం కనకదుర్గ, గోలి మధు (మంగళగిరి), షేక్ కాశింబి, యర్రగుంట్ల పాణిరావు, మేడిశెట్టి సుభద్రా కృష్ణ, డా.ఎస్.సి.హెచ్.సుధా మైథిలి, గడల శివప్రసాద్, లంకా మాధవి, మన్నం వెంకటగురువు, బండికల్లు జమదగ్ని, చల్లా సత్యవతి(పిడుగురాళ్ల), విష్ణు మొలకల భీమేశ్వరప్రసాద్(తెనాలి) పాల్గొన్నారు. కవి అబ్దుల్ రజా హుస్సేన్‌ను, గంగవరపు సునీతను, పూసపాటి కృష్ణ సూర్యకుమార్‌లను డా.భూసురపల్లి వెంకటేశ్వర్లు, డా.రావి రంగారావు, డాక్టర్ టి.సేవకుమార్, శాంతశ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీమన్నారాయణ, నవ మల్లె తీగ సంపాదకులు కలిమిశ్రీ తదితరులు సత్కరించారు. ఫేస్బుక్ కవితల వర్క్ షాపులో జనవరి నెల కవి ప్రతిభా పురస్కారాన్ని శరకణం కనకదుర్గకు డాక్టర్ రావి రంగారావు అందజేశారు.



జనవరి 22న, "979 పోస్టులతో" యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్- 2025 విడుదలైంది. అయితే గత ఏడాది (2024లో) వెయ్యికి పైగా పోస్టులుండగా, అంతకుముందు సంవత్సరం (2023లో) 1100లకు పైగా పోస్టులున్నాయి. అయితే మొత్తం భర్తీ చేసే సర్వీసులను ఈ సారి 23కు పెంచడం జరిగింది (గత ఏడాది 21 సర్వీసులతో నోటిఫికేషన్ ఇచ్చారు). ఈసారి ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (IRMS)ను విభజించి, ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్, ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్-ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీస్‌లుగా చేయడంతో ఈసారి భర్తీ చేసే సర్వీస్‌ల సంఖ్య 23కు పెరిగింది.

యూపీఎస్సీ సివిల్స్ ప్రిపరేషన్ ప్లాన్

దిక్సూచి DIKSUCHI

తాజా నోటిఫికేషన్‌లో మార్పులు

- సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌కు కనీస విద్యార్హత అయిన గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు హాజరుకావచ్చు. గతంలో వీరు కేవలం ప్రిలిమినరీ వరకు మాత్రమే అవకాశం ఉండేది, మెయిన్స్ పరీక్షలకు హాజరు కావాలంటే మాత్రం గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ సమర్పించాలి. ప్రస్తుతం ఇంటర్వ్యూకి ముందు నిర్ధేశిత గడువులోగా ఉత్తీర్ణత సర్టిఫికేట్ సమర్పిస్తే చాలు.
- రిజర్వేషన్లు, వయోపరిమితి సడలింపులు కోరుతున్న అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ప్రిలిమినరీ అప్లికేషన్‌లోనే సమర్పించాలి. గతంలో ఈ నియమం ప్రిలిమ్స్ దశలో లేదు.
- ఆదేవిధంగా OBCలు కుల ధృవీకరణ పత్రంతో పాటుగా, నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్‌ను కూడా దాఖలు చేయాలి. నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్ గడచిన మూడు ఆర్థిక సంవత్సరాలు(2021-22, 2022-23, 2023-245) సంబంధించినదై ఉండాలి OBC సర్టిఫికేట్ 01-04-2024 మరియు 11-02-2025 మధ్య జారీ అయినదై వుండాలి .
- EWS రిజర్వేషన్‌కు అర్హులైనవారు కూడా, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, నిర్ణీత అధికారిచే 01-04-2024 మరియు 11-02-2025 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వ క్రైటీరియా ప్రకారం జారీ చేయబడిన ఇన్ కమ్ అండ్ అసెట్ సర్టిఫికెట్‌ను ప్రిలిమినరీ అప్లికేషన్ దశలోనే సమర్పించాల్సి వుంటుంది.
- ఈసారి "సర్వీస్ ప్రిఫరెన్స్"లను కూడా ప్రిలిమినరీ ఎగ్జామ్ అప్లికేషన్‌లోనే ఎంచుకోవాల్సి ఉంది. అదేవిధంగా "క్యాడర్ ప్రిఫరెన్స్"లను ప్రిలిమ్స్ పరీక్ష అయిన 10 రోజుల తరువాత సమర్పించాలి.
- UPSC పరీక్షకు వన్ టైమ్ రిజిస్ట్రేషన్ అనేది తప్పనిసరి. తొలిసారిగా పరీక్షకు హాజరయ్యేవారు ముందుగా UPSC వెబ్‌సైట్‌లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలి. ఈ వన్ టైమ్ రిజిస్ట్రేషన్లో సమర్పించిన వివరాలను (డేట్ ఆఫ్ బర్త్ మినహా), సమర్పించిన తేదీ నుండి 2025 ఫిబ్రవరి 25 లోపుగా ఎప్పుడైనా సవరించుకోవచ్చు.

పరీక్ష విధానం:

భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పోటీ పరీక్షల్లో యూపీఎస్సీ సీఎస్ఈ ఒకటి. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) మరియు ఇతర కేంద్రప్రభుత్వ సర్వీస్‌లకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి యూపీఎస్సీ ఈ పరీక్షను నిర్వహిస్తుంది.

- **పరీక్ష విధానం:** యూపీఎస్సీ సీఎస్ఈ పరీక్ష మూడు దశలలో జరుగుతుంది.
- **మొదటి దశ:** ప్రిలిమినరీ ఎగ్జామినేషన్
- **రెండవ దశ:** మెయిన్ ఎగ్జామినేషన్ (మెయిన్స్)
- **మూడో దశ:** పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)
- మెయిన్స్, ఇంటర్వ్యూ మార్కులు కలిపి ఫైనల్ ర్యాంక్ లిస్టును ఇస్తారు.

ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ (ప్రిలిమ్స్): ఇది మొదటి దశ, ఇందులో రెండు ఆబ్జెక్టివ్ తరహా పేపర్లు ఉంటాయి.

జనరల్ స్టడీస్ పేపర్-1: ఇందులో హిస్టరీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ జనరల్ నాలెడ్జ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సీశాట్) పేపర్ 2: పేపర్-2లో కాంప్రహెన్షన్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, బేసిక్ న్యూమరసీ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి(ఒక్కో పేపర్ 200 మార్కులకి ఉంటుంది).

- CSAT కేవలం క్వాలిఫైయింగ్ పేపర్ మాత్రమే. దీనిలో తప్పనిసరిగా 200 మార్కులకి 33%/66 మార్కులు రావాలి.
- పేపర్ 1 మాత్రం కట్ ఆఫ్ మార్కులు ఉంటాయి. ప్రతి సంవత్సరం కట్ ఆఫ్ మార్కు మారుతూ ఉంటుంది.

మెయిన్స్: రాత పరీక్ష ఇందులో తొమ్మిది పేపర్లు ఉంటాయి. ఇవి అభ్యర్థి పరిజ్ఞానాన్ని, లోతుగా పరీక్షిస్తాయి. నిజ జీవిత సంఘటనలను అభ్యర్థులు ఏ విధంగా అర్థం చేసుకోగలుగుతున్నారో అంచనా వేస్తాయి.

తప్పనిసరి పేపర్లు: పేపర్ ఏ(ఇండియన్ లాంగ్వేజ్), పేపర్ బి(ఇంగ్లిష్) ఈ రెండు పేపర్లు ఒక్కో పేపర్‌కి 300 మార్కులు ఉంటాయి. ఒక్కో పేపర్‌లో తప్పనిసరిగ్గా 75 మార్కులు సాధించాలి.

పేపర్ 1: జనరల్ ఎస్సే **పేపర్ 2:** జనరల్ స్టడీస్-1
పేపర్ 3: జనరల్ స్టడీస్-2 **పేపర్ 4:** జనరల్ స్టడీస్-3
పేపర్ 5: జనరల్ స్టడీస్-4 **పేపర్ 6:** ఆప్షనల్ పేపర్ -1
పేపర్ 7: ఆప్షనల్ పేపర్-2 (ఒక్కో పేపర్ 250 మార్కులు)

పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ): అభ్యర్థుల వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, వారి పరిపాలన సామర్థ్యాన్ని అంచనా వేస్తారు(దీనికి 275 మార్కులు).

అర్హతలు:

వయోపరిమితి: అభ్యర్థుల వయస్సు 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి(కేటగిరీలను అనుసరించి సడలింపు ఉంటుంది).

విద్యార్హతలు: బ్యాచిలర్ డిగ్రీ

ఎన్నిసార్లు రాయవచ్చు: అభ్యర్థులు తమ కేటగిరీని బట్టి (జనరల్ కేటగిరీ అభ్యర్థులు-6 సార్లు, ఓబీసీ-9 సార్లు, ఎస్సీ/ ఎస్టీ-అపరిమితం) పరిమిత సంఖ్యలో రాయవచ్చు.

ఆప్షనల్ సబ్జెక్టులు(మెయిన్స్‌కి మాత్రమే): నోటిఫికేషన్‌లోని జాబితా నుంచి ఒక ఆప్షనల్ సబ్జెక్టును ఎంచుకోవాలి.

పరీక్ష షెడ్యూలు: ప్రతి ఏడాది ఫిబ్రవరి/మార్చిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. ప్రిలిమినరీ పరీక్ష మే/జూన్‌లో, మెయిన్స్ సెప్టెంబర్/అక్టోబర్‌లో, ఇంటర్వ్యూను మరుసటి సంవత్సరం ఫిబ్రవరి/మార్చిలో నిర్వహిస్తారు.

ప్రిపరేషన్: సిలబస్ చాలా విస్తృతంగా ఉంటుంది, పరీక్ష సంక్లిష్టత కారణంగా చాలా మంది అభ్యర్థులు ఏడాది లేదా అంతకంటే ఎక్కువ కాలంపాటు ప్రిపేర్ అవుతారు. చాలా మంది కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, స్టడీ మెటీరియల్, ఆన్‌లైన్ రిసోర్సెస్, కరెంట్ అఫైర్స్ అప్‌డేట్స్‌పై ఆధారపడతారు.

- ప్రిపరేషన్‌లో నిరంతరం చదవడం, రైటింగ్ ప్రాక్టీస్, ప్రాక్టీస్ ఎగ్జామ్స్ రాయాలి.
- సంక్షిప్తంగా, యుపీఎస్సీ సీఎస్ఈ అనేది భారతదేశంలోని పరిపాలనా వ్యవస్థలో ఉన్నతమైన పదవులకు అత్యంత సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేసే సవాలుతో కూడిన పరీక్ష. దీనికి క్రమశిక్షణ, అంకితభావం, విభిన్న అంశాలపై సమగ్ర అవగాహన అవసరం.

స్టడీ మెటీరియల్: మార్కెట్‌లో రకరకాల స్టడీ మెటీరియల్స్ ఉన్నాయి. ఇందులో ఆన్‌లైన్ మెటీరియల్స్, కోచింగ్‌లు అధిక సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఎంపిక చాలా జాగ్రత్తగా ఉండాలి.



ఎం. బాలలత,
సివిల్స్ మెంటార్

షైనింగ్ కెరీర్ ఫుట్‌వేర్ డిజైనింగ్

ఒక వ్యక్తి ఆహార్యాన్ని ఉన్నతంగా రూపొందించడంలో మేకప్, దుస్తులతో సమాన ప్రాధాన్యం పాదరక్షలది కూడా. ఆకట్టుకునే బట్టలు కట్టుకున్న వ్యక్తి ఆకు చెప్పులతో తిరిగితే ఎబ్బెట్టుగా ఉంటుంది. సమయానికి అనుగుణమైన పాదరక్షలు ధరిస్తే సౌకర్యవంతంగా, హుందాగా ఉంటుంది. పాదరక్షల తయారీ అనేది ఒక పెద్ద ఇండస్ట్రీ. అందుకే భారతదేశంలో ప్రధాన రంగాల్లో లెదర్ ఇండస్ట్రీ ఒకటిగా ఎదిగింది. దేశ జాతీయ ఉత్పత్తిలో రెండు శాతం వాటా ఉన్న ఈ రంగం, దాదాపు 44 లక్షల మందిపైగా ఉద్యోగాలు కల్పిస్తోంది. లెదర్ ఇండస్ట్రీని మార్కెట్‌కు అనుగుణంగా తీర్చిదిద్దడంలో 'ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్'(ఎఫ్‌డీడీఐ)లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.



ఇంజనీరింగ్ చదువులకు ఐఐటీ, మేనేజ్‌మెంట్ కోర్సులకు ఐఐఎమ్, దుస్తుల ఫ్యాషన్‌కు నిఫ్ట్ ఎలాగో ఫుట్‌వేర్ చదువులకు ఎఫ్‌డీడీఐ అలాంటిది. దేశ వ్యాప్తంగా హైదరాబాద్‌తో సహా నోయిడా, కోల్‌కతా, రోహతక్, రాయ్‌బరేలీ, జోధ్‌పూర్, చెన్నై, చింద్వారా, చండీగడ్, గుణ, అంకలేశ్వర్, పట్నాల్లో 12 ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో 2025-26 అకడమిక్ సంవత్సరం యూజీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ వెలువడింది. ఆల్‌ఇండియా సెలెక్షన్ టెస్ట్-2025 (ఏఐఎస్‌టీ-2025) ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

బ్యాచిలర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు:

1. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీడీఎస్): నాలుగు సంవత్సరాల కోర్సు ఇది. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి.
- బీడీఈఎస్(ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్)
- బీడీఈఎస్(ఫ్యాషన్ డిజైన్)
- బీడీఈఎస్(లెదర్, లైఫ్ స్టయిల్ అండ్ ప్రొడక్ట్ డిజైన్)

2. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ): నాలుగు సంవత్సరాల కోర్సు ఇది. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి.
- బీబీఏ(రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్)

మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు

1. మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎండీఎస్): రెండు సంవత్సరాల కోర్సు ఇది. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.
- ఎండీఈఎస్(ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్)
- ఎండీఈఎస్(ఫ్యాషన్ డిజైన్)

2. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ): ఎంబీఏ(రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్)

అర్హతలు: బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు ఇంటర్‌మీడియేట్, మాస్టర్ డిగ్రీ కోర్సులకు ఏదైనా డిగ్రీ పాసై ఉండాలి.

వయస్సు: బ్యాచిలర్ డిగ్రీలో చేరాలనుకునే వారి వయస్సు 25 సంవత్సరాలలోపు ఉండాలి. పీజీ కోర్సులకు వయోపరిమితి లేదు.

చివరి తేదీ: ఏప్రిల్ 20 **ఎంట్రెన్స్ తేదీ:** మే 11
ఫలితాలు: 2025 జూన్ **మొత్తం సీట్లు:** 2390
వెబ్‌సైట్: https://fddiindia.com/

ఐఐటీల్లో ఏఐ కోర్సులు

ఐఐటీలాంటి సంస్థల్లో చదువుకోలేక పోతున్నాం అని బాధ పడాల్సిన అవసరమే వద్దు. దేశంలోని చాలా ఐఐటీలు పలు విభాగాలకు సంబంధించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఐఐటీ ఫ్యాకల్టీల ఆధ్వర్యంలో నడిచే ఈ కోర్సుల్లో చేరితే తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో వీటిని పొందవచ్చు. వీటికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుంది. తమ రెగ్యులర్ చదువులు కొనసాగిస్తూనే వీటిలో చేరవచ్చు. రాబోయే కాలం అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దే. దీనిని దృష్టిలో ఉంచుకుని ఐఐటీ మద్రాస్, రూర్కీలు కొన్ని కోర్సులను రూపొందించాయి.

ఐఐటీ మద్రాస్: వర్కింగ్ ప్రొఫెషనల్స్‌ను ఉద్దేశించి ఐఐటీ మద్రాస్ 'వెబ్ ఎంటెక్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' కోర్సును ప్రారంభించింది. 2025 మే 31లోపు ఈ కోర్సులో చేరవచ్చు. దీనితోపాటుగా ఏరోస్పేస్ ఇంజనీరింగ్(ఏరో స్పేస్, అమ్యునిషన్ టెక్నాలజీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ), ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ అండ్ సిస్టమ్స్, కమ్యూనికేషన్ సిస్టమ్స్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, మల్టీ మీడియా, మైక్రో ఎలక్ట్రానిక్స్), మెకానికల్ ఇంజనీరింగ్(మెకానికల్ డిజైన్, ఆటోమోటివ్ టెక్నాలజీ), ఈ మొబిలిటీ తదితర కోర్సులు ఉన్నాయి. వివరాల కోసం code.iitm.ac.in/webmtech వెబ్‌సైట్ చూడవచ్చు.

ఐఐటీ రూర్కీ: ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఏఐ, జెన్ ఏఐ, ఎజెంటిక్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్స్'లలో పీజీ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఇది పదకొండు నెలల ప్రోగ్రామ్. లైవ్, రికార్డెడ్ సెషన్స్‌లో ఉంటుంది. ఇంజనీరింగ్ విద్యార్థులకు హాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఉండేలా డిజైన్ చేశారు. వివరాల కోసం www.iitr.ac.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఆషికి-3లో శ్రీలీల



పుష్ప-2 సినిమాలో కిస్సిక్ పాటతో అభిమానులను అలరించారు కథానాయిక శ్రీలీల. కొంతకాలంగా ఆమె బాలీవుడ్ అరంగేట్రంపై ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు అధికారిక ప్రకటన వచ్చింది. 'ఆషికీ 3' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికయ్యారు. ఇందులో కార్తిక్ ఆర్యన్ సరసన శ్రీలీల కనిపించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ టీజర్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. అనురాగ్ బసు దర్శకత్వంలో టీ సిరీస్, అనురాగ్ బసు ప్రొడక్షన్స్ బ్యానర్లపై భూషణ్ కుమార్, కృష్ణ కుమార్ నిర్మిస్తున్నారు. కాగా, టీజర్‌లో బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ 'ఆషికి-2'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతున్నట్లు అర్థమవుతోంది. 1990లో 'ఆషికి' మొదటి భాగం విడుదలై ఘన విజయం సాధించింది. ఆ తర్వాత 2013లో 'ఆషికి-2' వచ్చింది. ఈ చిత్రం దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా వస్తున్న 'ఆషికి-3'లో శ్రీలీల నటిస్తుండటం ఆమె అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కాగా, ఈ చిత్రాన్ని దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.




అందుకోసమే ఆ చీర దాచుకున్నా

- సాయిపల్లవి

జాతీయ అవార్డు కోసం ఎదురు చూస్తున్నానని, అవార్డుల ప్రదానోత్సవానికి అమ్మమ్మ ఇచ్చిన చీర కట్టుకుని వెళ్లే సమయం కోసం వేచి చూస్తున్నానని సాయిపల్లవి తెలిపారు. తన అభినయంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్న ఈ భామ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో జాతీయ అవార్డు కోసం ఎదురుచూడటం వెనక ఉన్న బలమైన కారణాన్ని వివరించారు. 'జాతీయ అవార్డు అందుకోవాలని ఎంతో ఆశగా ఉంది. నాకు 21 ఏళ్ల వయసు ఉన్నప్పుడు మా అమ్మమ్మ ఓ చీర ఇచ్చి, నా పెళ్లిలో కట్టుకోమ్మంది. అప్పటికి నేనింకా సినిమాల్లోకి రాలేదు. కనుక పెళ్లి చేసుకునేటప్పుడు కట్టుకుందామనుకున్నా. ఆ తర్వాత మూడేళ్లకు సినిమాల్లో నటించడం మొదలు పెట్టా. నా తొలి చిత్రం 'ప్రేమమ్'లో నటిస్తున్నప్పుడే ఏదో ఒక రోజు జాతీయ స్థాయి అవార్డును అందుకోగలననే నమ్మకం ఏర్పడింది. ఆ రోజు అమ్మమ్మ ఇచ్చిన చీర కట్టుకుని అవార్డుల ప్రదానోత్సవానికి హాజరవ్వాలని నిర్ణయించుకున్నా. అవార్డును అందుకున్నా... అందుకోకపోయినా చీర కట్టుకోవాలనే ఒత్తిడి ఉండనే ఉంటుంది' అని చెప్పారు సాయి పల్లవి. కాగా, 'గార్గి' చిత్రానికి గాను జాతీయ అవార్డు వస్తుందని సాయిపల్లవి అభిమానులు ఎంతగానో ఆశించారు. చివరకు నిరాశే ఎదురైంది.

ఆదరణ ఆనందాన్నిస్తోంది



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తండేల్'. ఈ చిత్రానికి దక్కుతున్న ఆదరణ పట్ల చిత్రబృందం సంతోషాన్ని వ్యక్తం చేసింది. అక్కినేని అభిమానులకు సూపర్‌హిట్‌చిత్రాన్ని అందిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని ఆదివారం చిత్రబృందం తెలిపింది. నాగచైతన్య, సాయిపల్లవి నటన, చందు మొండేటి దర్శకత్వ ప్రతిభతో ఈ అద్భుతం సాధ్యమైందని పేర్కొంది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం రూ.వంద కోట్ల క్లబ్‌లో చేరిన విషయం తెలిసిందే.

మల్లయుద్ధం నేపథ్యంలో



తమిళ హీరో శివకార్తికేయన్, దర్శకుడు మురుగదాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'ఎస్‌కె23'(వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంలో సప్త సాగర దాచె ఎల్లో(సప్త సాగరాలు దాటి) ఫేమ్ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో చెన్నైలో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో మల్లయుద్ధం నేపథ్యంలో సాగే పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రం టైటిల్‌ను నేడు ప్రకటించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

తొలి తెలుగు మహిళా నిర్మాత
కృష్ణవేణి అస్తమయం

తెలుగు వారి ఆరాధ్య నటుడు నందమూరి తారకరామారావును వెండితెరకు పరిచయం చేసిన సినిమా 'మనదేశం'. జాతీయోద్యమ స్ఫూర్తిని కళ్లకు కట్టిన మొట్టమొదటి చిత్రరాజం కూడా ఇదే.! ఈ చిత్ర నిర్మాత, కథానాయికి, తెలుగు సినిమా చరిత్రకు నూరు వసంతాల సజీవ సాక్షి, ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత మేకా కృష్ణవేణి ఆదివారం కన్నుమూశారు.




తెలుగు సినిమా రంగంలో తొలితరం నాయిక, తొలి మహిళా నిర్మాతగా ఖ్యాతి గడించిన మేకా కృష్ణవేణి (102) ఆదివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. తెలుగు సినిమా చరిత్రలో ఆమెది ఓ ప్రత్యేక అధ్యాయం. తొలితరం నటిగా, గాయనిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా తనదైన ముద్రను వేశారు కృష్ణవేణి. 1924, డిసెంబర్ 24న పశ్చిమ గోదావరి జిల్లా పంగిడి గ్రామంలో కృష్ణవేణి జన్మించారు. బాల్యం నుంచి నాటకాలంటే కృష్ణవేణికి ఆసక్తి ఎక్కువ. బాల తారలతో 'అనసూయ' చిత్రాన్ని రూపొందించాలని భావించిన దర్శకులు సి. పుల్లయ్య రాజమండ్రిలో కృష్ణవేణి నటించిన 'తులాభారం' నాటకాన్ని చూసి టైటిల్ రోల్‌కు ఆమెను ఎంపిక చేశారు. అప్పుడు కృష్ణవేణి వయసు పది సంవత్సరాలు. ఈ సినిమా నిర్మాణం మొత్తం కోల్‌కతాలో జరిగింది. ఆ తర్వాత ఆమె తిరిగి రాజమండ్రి వచ్చి నాటకాలు వేయడం ప్రారంభించారు. అదే సమయంలో ఆమె తండ్రి డాక్టర్ కృష్ణారావు కన్నుమూశారు. దాంతో తల్లి, చిన్నానల ప్రాపకంలో పెరిగింది. 1937లో సి.ఎస్.ఆర్. ఆంజనేయులు ఆమెను ప్రోత్సహిస్తూ చెన్నయ్ తీసుకెళ్ళారు. ఆ సమయంలో ఆమె 'తుకారం' సినిమాలో నటించారు. అలా కొన్ని చిత్రాలలో బాల నటిగా రాణించారు.

'కచదేవయాని'తో హీరోయిన్‌గా


కృష్ణవేణి హీరోయిన్ గా నటించిన తొలి చిత్రం 'కచదేవయాని' 1938లో వచ్చింది. ఆ తర్వాత ఆమె దాదాపు ఇరవై సినిమాలలో నటించారు. 1939లో 'మహానంద' చిత్రంలో నటిస్తుండగా ప్రసిద్ధ దర్శక నిర్మాత మీర్జాపురం రాజా తో పరిచయం అయ్యింది. అది ప్రేమగా మారి 1940లో వారు విజయవాడలో వివాహం చేసుకున్నారు. వివాహానంతరం భర్త కోరిక మేరకు కృష్ణవేణి బయటి చిత్రాలలో నటించలేదు. సొంత చిత్రాలలోనే నటించారు. అలానే తమ శోభనాచల స్టూడియోస్ వ్యవహారాలను పర్యవేక్షించారు. అదే బ్యానర్ లో పలు చిత్రాలను నిర్మించారు. ఈ బ్యానర్ లో వచ్చిన తొలి సాంఘీక చిత్రం 'జీవనజ్యోతి' ద్వారానే చదలవాడ నారాయణరావు హీరోగా పరిచయం అయ్యారు. నటిగా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచీ కృష్ణవేణి తన పాటలను తానే పాడుకున్నారు. విశేషం ఏమంటే ఆమె 'కీలుగుర్రం' సినిమాలో అంజలీదేవికి ప్లేబ్యాక్ పాడారు. త్రిపురనేని గోపీచంద్ 'లక్ష్మమ్మ' చిత్రాన్ని మొదట మాలతీతో మొదలు పెట్టినా ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. దానిని శోభనాచల స్టూడియోస్ టేకోవర్ చేసింది. దాంతో అందులో కృష్ణవేణి నాయికగా నటించారు. ఈ సినిమాకు పోటీగా అంజలీదేవి నాయికగా 'శ్రీ లక్ష్మమ్మ కథ' మొదలైంది. రెండూ పోటాపోటీగా జనం ముందుకు వచ్చాయి. అయితే కృష్ణవేణి నటించిన 'లక్ష్మమ్మ' చిత్రానికే జనాధరణ దక్కింది. ఇక 1947లో వచ్చిన 'గొల్లభామ' నటిగా కృష్ణవేణికి అఖండ కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టింది. కేవలం కథానాయిక పాత్రలే కాకుండా భిన్నమైన పాత్రలను చేయాలని తపించారు. ఆమె 'తిరుగుబాటు' సినిమాలో వ్యాంప్ పాత్రను పోషించారు.

'మనదేశం'తో ఎన్టీఆర్‌కు తొలి అవకాశం

1942లో కృష్ణవేణి, మీర్జాపురం రాజా దంపతులకు అనూరాధాదేవి జన్మించారు. ఆమె పేరుతో ఎం.ఆర్.ఎ. అనే బ్యానర్ ను స్థాపించి, ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో కృష్ణవేణి 'మనదేశం' చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ద్వారానే ఎన్టీఆర్ చిత్రసీమకు పరిచయం అయ్యారు. బెంగాలీ భాషలో వచ్చిన 'విప్రదాసు' నవల ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఘంటసాల, రమేశ్ నాయుడుని సంగీత దర్శకులుగా పరిచయం చేశారు, పి. లీల, జిక్కీ లను గాయనీ మణులుగా, ఎర్రా అప్పారావును దర్శకుడిగా జనం ముందుకు తీసుకొచ్చిందీ కృష్ణవేణే! తొలితరం నటీమణులలో అత్యధిక పారితోషికం తీసుకున్న వ్యక్తి కూడా ఆమే. అప్పట్లోనే రూ.45 వేల పారితోషికం తీసుకున్నారామె. నటిగా కృష్ణవేణి చివరగా 'సాహసం' సినిమా చేశారు. అలానే నిర్మాతగా ఆమె చివరి చిత్రం 1957లో వచ్చిన 'దాంపత్యం'. ఆమె కుమార్తె అనూరాధాదేవి తల్లి అడుగుజాడల్లో నడుస్తూ పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. సినిమా రంగానికి కృష్ణవేణి అందించిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రఘుపతి వెంకయ్య నాయుడు అవార్డుతో సత్కరించింది. ఇటీవల విజయవాడలో జరిగిన 'మనదేశం' వజ్రోత్సవ వేడుకల్లోనూ కృష్ణవేణి పాల్గొన్నారు. ఆ వేదికపై భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సత్కరించారు. ఆదివారం మహా ప్రస్థానంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.




"నటీమణి, సినీ నిర్మాత కృష్ణవేణి గారి మరణం నన్ను బాధించింది. 'మనదేశం' చిత్రంతో ఎన్టీఆర్‌ను చిత్రరంగానికి పరిచయం చేసి కళారంగానికి వారు చేసిన సేవ మరువలేనిది"
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



"ఎన్టీఆర్ నట జీవితానికి తొలి అవకాశమిచ్చిన కృష్ణవేణి గారి మృతి బాధాకరం. నటి, నిర్మాత, స్టూడియో అధినేతగా ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారు. ఆమె మృతి వ్యక్తిగతంగా మాకు తీరని లోటు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను"
- నందమూరి బాలకృష్ణ



సినీ నిర్మాత, నటి కృష్ణవేణి మృతి బాధాకరమని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కృష్ణవేణి తెలుగు సినీకీర్తిని దశదిశలా చాటారని కొనియాడారు. కృష్ణవేణి మృతికి సంతాపం తెలిపారు.



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తొలి మహిళా నిర్మాతగా గుర్తింపు పొందిన కృష్ణవేణి తుదిశ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.
- ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

కర్రసాములో యువకుల ప్రతిభ

పెదనందిపాడు, ఫిబ్రవరి, 16 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా అద్దంకిలో హీరో సుమన్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి యుద్ధ కళలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెదనందిపాడుకు చెందిన బాపట్ల లోకేశ్, భూపేష్, మామిడిపాక మోక్షరామకృష్ణ ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుపొందినట్లు శిక్షకులు రాము తెలిపారు.

పశ్చిమ డెల్టా కాల్వకు నీటి విడుదల

దుగ్గిరాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1716 క్యూసెక్కుల సాగు నీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 11.9 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హై లెవెల్ ఛానల్‌కు 80 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 196, తూర్పుకాల్వకు 281, పశ్చిమ కాల్వకు 105, నిజాంపట్నం కాల్వకు 76, కొమ్మమూరు కాల్వకు 376 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

● రూ.82,240 నగదు స్వాధీనం

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గారపాడు పొలిమేరల్లో రహస్యంగా సాగుతున్న పేకాట స్థావరంపై ఆదివారం వట్టిచెరుకూరు సీఐ రమా నాయక్, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్, పోలీసు సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించి 18 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ 82,240 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమా నాయక్ వెల్లడించారు.

లక్ష్మణరావును గెలిపించండి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీగా కేఎల్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు పాశం రామారావు మండలంలోని వడ్డేశ్వరంలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్ కార్మికులు తదితర ప్రజల సమస్యల పరిష్కారం కోసం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎల్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ప్రజా సంఘాల నేతలు, పల్లె కృష్ణ, ఎస్‌కే ఘన్, పల్లె భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ చుట్టుపక్కల వారికి ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ కళ్యాణ్‌రాజు హెచ్చరించారు. పట్టణంలోని నులకపేట, శ్మశాన వాటికలు, కాల్వ ఒడ్డులు తదితర ప్రాంతాల్లో ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మరోసారి ఇలా చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ కళ్యాణ్‌రాజు హెచ్చరించారు. అలాగే స్థానిక మహిళలను సమావేశ పరిచి ఇలా మద్యం సేవించే వారు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

మంగళగిరి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన దినసరి కూలీ కే.ఏడుకొండలు ముఠా పనిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు సూచన మేరకు పల్లెటూరి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జొన్న రాజేష్ ఆదివారం ఏడుకొండలు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్మికుడి కుటుంబానికి ప్రమాద బీమా మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో లేళ్ల సాయినందన్, బత్తినేని అంజయ్య, అజయ్‌బాబు, పావని, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులో యువకుల వీరంగం

● మద్యం మత్తులో రాళ్లతో దాడికి యత్నం
● తాడికొండలోని వైన్ షాపు వద్ద ఘటన
● పోలీసుల అదుపులో యువకుడు

తాడికొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వైన్ షాపులో మద్యం తాగటానికి వచ్చిన వ్యక్తులు తెలియకుండా తన మంచినీళ్లు తాగినందుకు ఓ యువకుడు దుర్భాషలాడి రాళ్లతో దాడికి ప్రయత్నించిన సంఘటన ఆదివారం తాడికొండలోని రాజధాని వైన్స్ వద్ద జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం... తాడికొండ గ్రామానికి చెందిన ఓ యువకుడు వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసి అనధికారికంగా నిర్వహిస్తున్న పర్మిట్ రూమ్‌లో మరో వ్యక్తితో కలిసి మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొంత మంది పొలం పనులు ముగించుకొని ఇంటికి వచ్చే క్రమంలో మద్యం కొనుగోలు కోసం వైన్ షాపు వద్దకు వచ్చారు. మద్యాన్ని కొనుగోలు చేసిన వ్యక్తులు అనధికార పర్మిట్ రూమ్‌లో మద్యం తాగటానికి సిద్ధమవ్వగా ఇందులో ఒక వ్యక్తికి దాహం వేయటంతో పక్కనే ఉన్న వాటర్ బాటిల్‌లో నీళ్లు తాగాడు. దీంతో వాటర్ బాటిల్‌లో నీళ్లు ఎందుకు తాగారని వారితో వాగ్వాదానికి దిగాడు. సారీ చెప్పినా, వాటర్ బాటిల్‌కు డబ్బులు ఇస్తామని ఎంత సర్దిచెప్పినా వినకుండా వారిపై దుర్భాషలాడుతూ రాళ్లతో దాడికి ప్రయత్నం చేశాడు. నాపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయి... పోలీస్‌స్టేషన్ నాకు కొత్తమే కాదు అని వాగ్వాదానికి దిగాడు. వైన్ షాపు వద్ద వివాదం జరుగుతున్న సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాళ్లతో దాడిచేయబోయిన వ్యక్తిని, అతనితో పాటు ఉన్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

కాకుమాను-కొమ్మూరు రహదారికి మోక్షం

● ఐదేళ్లుగా నరకం అనుభవించిన వాహనదారులు
● టీడీపీ హయాంలో రూ 1.82 కోట్లతో నూతన రహదారి



వైసీపీ ప్రభుత్వ హయాంలో.. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో రహదారి

కాకుమాను, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కాకుమాను-పెదనందిపాడు ప్రధాన రహదారిలో కాకుమాను శివారు నుంచి కొమ్మూరు వరకు ఆర్ అండ్ బీ రహదారి గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధ్వానంగా తయారైంది. భారీ వాహనాల రాకపోకలతో ఆ రహదారి ఆనవాలు కోల్పోయి గుంతల రహదారిగా మారింది. వర్షం పడిన సందర్భంలో గుంతలలో వాన నీరు నిలిచి గుంత ఎంత లోతు ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు, కార్లు, బస్సుల్లో ప్రయాణించిన వారి బాధలు వర్ణనాతీతం. అనేక సార్లు రోడ్డు ప్రమాదాలు జరిగినా గత ప్రభుత్వంలో కనీసం రహదారి మరమ్మతులకు కూడా నోచుకోలేదు.

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాకుమాను-కొమ్మూరు రహదారికి రూ 1.82 కోట్లు నిధులు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణ పనులు కూడా గుత్తేదారు వేగంగా చేయడంతో పాటు ఆదివారానికి రహదారికి తారుతో నూతన రహదారిగా తయారవడంతో వాహన చోదకులు, కొమ్మూరు, పెద్దివారిపాలెం వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కాంట్రాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రధాన రహదారులను కూడా నూతన రహదారులుగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఉపాధ్యాయులకు అండగా మంత్రి లోకేశ్



మీడియాతో మాట్లాడుతున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

తాడేపల్లిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని, వారికి ఎప్పుడూ అండగా ఉంటారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ మెడికల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌కు ఆదివారం విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన, బీజేపీ బలపర్చిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ టీడీపీ తరఫున కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారని అన్నారు. ఆయనను గెలిపించాలని కూటమిలో ఏ విధమైన విభేదాలు లేవని స్పష్టంచేశారు. యువత తమ వెంటే ఉన్నారని గత వైసీపీ హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో 20 సంవత్సరాల పాటు వెనక్కు వెళ్లిందని చిల్లపల్లి విమర్శించారు. నిరుద్యోగాన్ని పారద్రోలాలి అంటే కొత్త ఉద్యోగాలను సృష్టించాలని, పరిశ్రమలను నెలకొల్పాలని ఆ దిశగా మంత్రి లోకేశ్ అడుగులు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేనపార్టీ నేతలు జొన్నా రాజేష్, అంబటి తిరుపతిరావు, సామల నాగేశ్వరరావు, చిట్టి అవినాష్, బడే కోమలి, దినేష్ చక్రవర్తి, పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ పర్వతం మధు తదితరులు పాల్గొన్నారు. కాగా ఉండవల్లి దేవుడు మాన్యం గ్రౌండ్‌లో యువతకు పల్లెటూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జొన్నా రాజేష్ క్రికెట్ కిట్‌ను చిల్లపల్లి శ్రీనివాసరావు చేతులమీదుగా అందజేశారు. అనంతరం చిల్లపల్లిని ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత..

మంగళగిరి,(ఆంధ్రజ్యోతి):మంగళగిరి వీజేపీ అండ్ డీఎల్‌బీ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన నిర్మల జూనియర్ కళాశాల సీనియర్ ఇంటర్ ఫేర్‌వెల్ వేడుకల్లో చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమ తులను అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదనరావు, జనసేన నేతలు సామల నాగేశ్వరరావు, షేక్ వజీర్ బాషా, చిట్టెం అవినాష్, తిరుమలశెట్టి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహాలయ ఆవరణలో శిశు స్థన్యపాన ప్రాంగణం ప్రారంభం



శిశు స్థన్యపాన ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి

మంగళగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిశు స్థన్యపాన ప్రాంగణాన్ని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ కే.శరత్‌చౌదరి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శరత్‌చౌదరి మాట్లాడుతూ శిశు స్థన్యపాన ప్రాంగణం మహిళలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ, సేవా కార్యక్రమాలను అభినందించారు. తొలుత శరత్‌చౌదరి దంపతులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చినకాకాని జడ్పీ హైస్కూలును సందర్శించి, అక్కడ ఏర్పాటుచేసిన కెరీర్ గైడెన్స్ చార్టును ఆవిష్కరించారు. మంగళగిరి నియోజకవర్గంలో మొత్తం 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన చార్టులను ఏర్పాటు చేస్తున్నట్టు చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమాల్లో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎ.రామకోటిరెడ్డి, రోటరీ డిప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ వంశీకృష్ణ, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళీమోహన్‌రావు, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, రొటేరియన్లు పాల్గొన్నారు.

ఘనంగా పాయస హవీర్ యజ్ఞం



పాయసం వండి సూర్యభగవానుడికి నివేదిస్తున్న భక్తులు

మంగళగిరి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మాఘ మాసం సందర్భంగా ఆదివారం మంగళగిరి దేవస్థానం గ్రౌండులో సూర్యనారాయణస్వామికి పాయస హవీర్‌యజ్ఞం నిర్వహించారు. ఏపీ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి రాజ్యలక్ష్మీ అవోపా, వాసవి క్లబ్ వనిత, వామ్, వాసవి పరివార్, రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ సంయుక్త సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. సూర్య భగవానుడి అనుగ్రహం కోసం ఒకే సమయంలో 241 మంది మహిళలచే 241 పాత్రలలో పాయసం వండి ఛాయ ఉషా సమేత సూర్యనారాయణ స్వామికి నివేదన చేశారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీస్వామి అనుగ్రహ భాషణంచేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ వనతి మంగళగిరి అధ్యక్షురాలు వల్లంకొండ శివమణి, కార్యదర్శి పారేపల్లి అరుణ, కోశాధికారి పులిపాటి జయశ్రీ, రాజ్యలక్ష్మి, అవోపా ప్రతినిధులు గాదంశెట్టి సుజాత, మాజేటి మీనా, దివ్వెల ఆదిలక్ష్మి, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.


ఘనంగా గంధ మహోత్సవం



జెండాలతో ఊరేగింపుగా వస్తున్న ముస్లింలు

దుగ్గిరాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): హిందూ, ముస్లింలు సమైక్యంగా జరుపుకునే హజరత్ మీరావలి, నాగేంద్రస్వామి గంధ(ఉరుసు) మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ముర్తుజానగర్ షాదీఖానా సమీపంలో ఒకే ప్రాంగణంలో ఉన్న హిందువులు పూజించే నాగేంద్రస్వామి పుట్టతోపాటు ముస్లింలు పూజించే మందిరం 16వ వార్షికోత్సవం సందర్భంగా దీపారాధన చేశారు. అనంతరం మందిరం నుంచి జెండాలతో మెయిన్‌రోడ్డులోని జెండాచెట్టు వద్దకు చేరుకుని టెంకాయలు కొట్టారు. తిరిగి పూజా మందిరానికి చేరుకున్న షాబుద్దీన్ భక్తులందరికీ గంధం పంపిణీ చేశారు. భక్తితో గంధం తీసుకున్న భక్తులందరికీ అన్నదానం చేశారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



దుగ్గిరాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల వారి 554వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల గ్రామం ఈమనిలోని శివాలయం ఆవరణలో శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి, రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్ బాబు మాట్లాడుతూ భారతదేశంలో అతిపెద్ద సామ్రాజ్యాన్ని పరిపాలించిన గొప్ప చక్రవర్తిగా, ఆంధ్రభోజుడిగా చరిత్రకెక్కిన కృష్ణదేవరాయలు భావితరాలకు స్ఫూర్తి అని అన్నారు. అనంతరం పేదలకు కూరగాయలను, చిన్నారులకు పెన్నులు, పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో యడ్ల సాయికృష్ణ, నారిశెట్టి రమేష్, నాగరాజు, చందు సూర్య పాల్గొన్నారు.

మంగళగిరి,(ఆంధ్రజ్యోతి): కృష్ణరాయ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం వద్ద వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళావేదిక ఆవరణలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వేరుకొండ వెంకట రమణ, వల్లంశెట్టి నాగేశ్వరరావు, బాణాల నాగేశ్వరరావు, గాదె నాగేంద్రం, గాజుల రామమోహనరావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, రంగిశెట్టి శ్రావణ్, పసుపులేటి విజయ్ కుమార్, ఎం.గురునాథం పాల్గొన్నారు.



జంగుగుంట్లపాలెంలో అనవేమారెడ్డి విగ్రహం

అనవేమారెడ్డి విగ్రహం ఆవిష్కరణ

మేడికొండూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొండవీటి సామ్రాజ్యాన్ని పాలించిన పాలకులలో అనవేమారెడ్డి సుప్రసిద్ధుడని, గౌరవ చిహ్నంగా 13 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని మేడికొండూరు మండలంలోని జంగుగుంట్లపాలెంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి మాట్లాడుతూ అనవేమారెడ్డి పరిపాలన క్రీశ 1364 నుంచి 22ఏళ్ల పాటు సాగిందని, ఆయన కవులకు, గాయకులకు ఎంతో ఆదరణ లభించిందన్నారు. అనవేమన 'ధర్మవేమనగా' రోజుకు ఆరుసార్లు శివ పూజలు నిర్వహించి 'షట్కాల శివపూజా దురంధరుడు'గా పేరుగాంచాడన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి సాంబిరెడ్డి, వార్డు సభ్యులు సాంబిరెడ్డి, తాళ్ల కోటిరెడ్డి, నారసాని జయసూర్య, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఆళ్ల బాపిరెడ్డి, చిర్రా శ్రీనివాసరెడ్డి, చిర్రా శేషిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

152 మందికి వైద్య పరీక్షలు

తుళ్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తుళ్లూరులో ఆదివారం బండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రేష్ఠ హాస్పటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 152 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. 74 మందికి బోన్ మ్యారో వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు మాట్లాడుతూ బండ్ల ఛారిటబుల్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, ట్రస్ట్ అధ్యక్షుడు బండ్ల పట్టాభిరామయ్య, టీడీపీ నాయకులు జమ్ముల అనిల్, బండ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు అప్పారావు, గ్రామస్థులుపాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేస్తున్న నామినేని

ఉపకారవేతనాల పంపిణీ

పెదనందిపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని కొప్పర్రు శ్రీకృష్ణసాయి కల్యాణ మండపంలో శ్రీ కాకతీయ వెల్ఫేర్ సొసైటీ గుంటూరు, ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫర్ హైయ్యర్ ఎడ్యుకేషన్ సొసైటీ, పూర్వ విద్యార్థుల సంఘం కొప్పర్రు వారు సంయుక్తంగా ప్రతిభ కలిగిన 36 మంది పేద విద్యార్థులకు ఆదివారం రూ.5 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. శ్రీ కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ నామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రవాసాంధ్రుడు డాక్టర్ బొల్లేపల్లి సుబ్బారావు, లక్ష్మీఅనసూయ దంపతులను దుశ్శాలువా పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ కాలేషావలి, డాక్టర్ జాష్టి రమ్యకృష్ణ, మాజీ జడ్పీటీసీ బత్తిని శారద, టుబాకో బోర్డు మాజీ డైరెక్టర్ జాష్టి రమేష్, పూర్వపు విద్యార్థి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పోకా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

దుగ్గిరాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెంలో గంజాయి స్వాధీనం చేసుకున్న కేసులో ముగ్గురు నిందితులను దుగ్గిరాల పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలో కిలో 100 గ్రాముల గంజాయిని దుగ్గిరాల పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. అరెస్టయిన వారిలో పెదపాలెం గ్రామానికి చెందిన పల్లెకూన గోపి, జెముడుగాని కోటేశ్వరరావు, లంకిరెడ్డి సోమిరెడ్డి ఉన్నారు. మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటరవిలు నిందితులను తెనాలి 2వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి వారికి 14 రోజులు రిమాండ్ విధించగా నరసరావుపేట సబ్ జైలుకి తరలించారు.

ఘనంగా ఏకలవ్య విగ్రహ ప్రతిష్ఠ 6వ వార్షికోత్సవం

దుగ్గిరాల, ఫిబ్రవరి 16: దుగ్గిరాల రైలుపేట వంతెన వద్ద ఆదివాసీ ఎరుకల సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఏకలవ్య విగ్రహ ప్రతిష్ఠా 6వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ గరిక శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కట్టా శంకర్, జిల్లా నాయకులు శ్రీనివాసరావు, వెంకట్వేరరావు, మండల కమిటీ సభ్యులు ఏకలవ్యుని విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఎర్రబాలెంలో ప్రచారం చేస్తున్న జయసత్య, కూటమి నేతలు

ఆలపాటి గెలుపు కోసం విస్తృత ప్రచారం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ కూటమి నేతలు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఎర్రబాలెం గ్రామంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ యువత, ఉపాధ్యాయ సమస్యలపై బలమైన గళం వినిపించగలిగిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు, నీలం అంకారావు, పాలకాయల శివనాగేశ్వరరావు, కాపరౌతు సుందరయ్య, సాలి సురేష్, ఫిరోజ్ ఖాన్, ఆకుల అజయ్‌బాబు, రాజేశ్వరీ, కర్నాటి సత్యనారాయణ, గడదాసు రంగారావు తదితరులు పాల్గొన్నారు. నవులూరులో టీడీపీ ఎస్సీ సెల్ గుంటూరు పార్లమెంటు అధ్యక్షుడు వేమూరి మైనర్‌బాబు, రుద్రు కోటేశ్వరరావు, కొత్తా శ్రీనివాస్, తెల్ల మేకల నాగేశ్వరరావు, కొల్లి వెంకటరావు, బత్తుల నాగరాజు, ఉమా, నరేంద్ర పాల్గొన్నారు. మంగళగిరిలోని 5, 6 వార్డుల్లో ఆలపాటికి మద్దతుగా కూటమి నేతలు ప్రచారం చేశారు. టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధానకార్యదర్శి షేక్‌రియాజ్, నేతలు జొన్నాదుల బాలకృష్ణ, వాకా మాధవరావు, గోసాల రాఘవ, జొన్నాదుల రామాంజనేయులు, కోవెలకారు రాకేష్, జీ.రవికుమార్, పొట్లాబత్తుని నరసింహారావు, నిడిగంటి స్టెఫిన్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అఖండ విజయం చేకూర్చాలని ఆదివారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. మండల గ్రామం తుమ్మపూడిలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీనేతలు బుస్సా నాగరాజు, మన్నవ సాంబశివరావు, బుస్సా క్రాంతి, మన్నవ జ్యోజి, శౌరి, సిద్ధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి టౌన్, (ఆంధ్రజ్యోతి): చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పట్టణ జనసేన అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు, నియోజకవర్గ నాయకులు జొన్నా రాజేష్ ఆధ్వర్యంలో 19వ వార్డు కెఎల్ రావు కాలనీలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దినేష్ చక్రవర్తి, నాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు కుంచనపల్లిలోని రిశాంత్ జయభేరి, జి-7, హర్ష, రామ్స్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ అపార్టుమెంట్లలో ఓటర్లను కలిసి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మన్నె సత్యనారాయణ, కోవెలమూడి బుల్లెబ్బాయి, లింగా వెంకటరావు పాల్గొన్నారు.

మేడికొండూరు, (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పలువురు బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మేడికొండూరులో ఎన్నికల ప్రచారం న్విహణపై బీజేపీ మండల అధ్యక్షుడు షేక్ బాషా అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి బీజేపీ గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి కంతేటి బ్రహ్మయ్య పాల్గొని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించేందుకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆలపాటిని గెలిపించాలని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలసి విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, నెలకుడి గోపాలకృష్ణమూర్తి, షేక్ ఉమర్, గోవిందరాజులు, నరసింహ కృపాకర్, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ బిలాల్, రోషి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ప్రత్తిపాడులో టీడీపీ మండల అధ్యక్షులు గింజుపల్లి శివరామప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటు హక్కు ఉన్న పట్టభద్రులను కలిసి కరపత్రాలు అందించి ఆలపాటి రాజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వార్డు మెంబరు మల్లం పరమేశ్వరరావు, అంకాళం కోటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొరిజవోలు శ్రీనివాసరావు, బీ శ్రీనివాసరావు, ఎం గోపి, అంకాళం పరమేశ్వరరావు, బసవబాబు, బాపయ్య తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుమ్మడి పుల్లేశ్వరరావు జ్ఞాపకార్థం మంగళగిరి వైష్ణవి కల్యాణ మండపంలో ఆదివారం జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఈ పోటీలను ప్రారంభించారు. పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్‌ప్రెస్ విభాగాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. తొలుత పుల్లేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సందాని, మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర, అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ఎన్ వంశీకృష్ణ, పీ.భాస్కరరావు, బి.ప్రసాద్, బొల్లినేని చంద్రిక, ఘట్టమనేని సాయిరేవతి, ఎస్‌కే మస్తాన్‌వలి, పవన్‌కుమార్, సందీప్, మల్లేశ్వరరావు, రాజు, పసుపులేటి సురేష్ తదితరులు పాల్గొన్నారు. పోటీల నిర్వహణకు సహకరించిన మంత్రి నారా లోకేశ్‌కు ఆర్గనైజర్ గుమ్మడి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.



గ్రామంలోని మహిళతో మాట్లాడుతున్న డాక్టర్ సుప్రియ, వలంటీర్లు

జీవన శైలి మార్పులతో హార్మోన్ల సమస్యకు చెక్

● కేఎల్ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సుప్రియ

దుగ్గిరాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో మార్పులతో స్త్రీలలో వయసు రీత్యా వచ్చే హార్మోన్ల సమస్యలను అధిగమించవచ్చునని కేఎల్ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సుప్రియ అన్నారు. ఆదివారం శృంగారపురం గ్రామంలో కేఎల్‌యూ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లతో కలిసి డాక్టర్ సుప్రియ ఇంటింటికీ తిరిగి హార్మోన్ల సమస్యలపై మహిళలకు అవగాహన కల్పించారు. హార్మోన్ల సమస్యతో అండాశయంలో మార్పులు చోటు చేసుకుని, రుతుక్రమం అసాధారణంగా మారుతుందన్నారు. కొందరు స్త్రీలలో అండోత్పత్తిపైన ప్రభావం చూపుతోందని, గర్భధారణ సమస్యలు ఏర్పడతాయన్నారు. డాక్టర్ సుప్రియ మాట్లా డుతూ, యోగా, మెడిటేషన్ ద్వారా మానసిక ఒత్తిడిని, ఆందోళనను దూరం చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌బియ్యాన్ని అక్రమార్కులు తరలిస్తుండగా రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పొన్నూరు నియోజకవర్గం చింతలపూడి నుండి 49 బస్తాల రేషన్ బియ్యంతో ఆదివారం బలోరో తెనాలి మండలం నందివెలుగు మీదుగా దుగ్గిరాల వైపు వెళుతుంది. సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాన్ని నిలిపి పరిశీలించగా రేషన్ బియ్యాన్ని గుర్తించి వాహనాన్ని సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

115 మందికి వైద్య పరీక్షలు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండమూడి గ్రామంలో ఆదివారం శంకర్ విజన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంను గ్రామ సర్పంచ్ కొరెడ్ల వెంకట సుబ్బారావు ప్రారంభించగా గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొరెడ్ల వాసు పర్యవేక్షించారు. మొత్తం 115మంది వైద్య సేవలకు హాజరు కాగా 10మందికి ఉచితంగా కళ్లజోళ్లు సరఫరాచేసి 20 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హంతకులను కాపాడుతున్న జగన్

జోసెఫ్ మోసిగంటి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): హంతకులు, వారి పదవులను కాపాడుతున్న నాయకుడు వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. డ్రైవర్‌ను చంపిన హంతకుడు అనంతబాబును పార్టీ నుంచి కానీ, పదవి నుంచి కానీ తొలగించకుండా వారిని కాపాడుతున్నారని దుయ్యబట్టారు. దువ్వాడ శ్రీనివాస్, అనంతబాబు వంటి వారిని పెద్దల సభకు పంపి ప్రజానికానికి ఏమి సందేశం ఇస్తున్నారని ఆయన వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను ప్రశ్నించారు.

ఉత్సాహంగా డాక్టర్ల క్రికెట్ పోటీలు

పెదకాకాని, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న ప్రారంభించిన డాక్టర్స్ క్రికెట్ క్రీడా పోటీలలో డాక్టర్లు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నంబూరులోని డీఎస్‌ఏ క్రికెట్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లాల డాక్టర్స్ క్రికెట్ పోటీలో మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీలను ఆదివారం పోలవరం ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ శివకుమార్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ దావులూరి రమేష్ అందజేశారు. పోటీలలో ఎవన్‌జెర్స్, జీబీఆర్, శ్రీటీమ్, ప్రైమ్‌ప్రాన్సెస్, అమృత, ఐకాన్, ఏ1, జీబీఆర్ టీమ్‌లు గెలుపొందినట్లు డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి.ఎస్.రెడ్డి, డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. శ్రీటీమ్‌లో బెస్ట్ బౌలర్‌గా పృథ్వి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిమ్మకాయాల పృథ్వీ రాజ్ నిలిచారు. ఆర్గనైజర్ సెక్రటరి డాక్టర్ సందీప్ వెల్లా, డాక్టర్ శ్రీనివాసరెడ్డి దాట్ల, డాక్టర్ జాన్ షహిద్, డాక్టర్ ఎం.డి అస్లం, డాక్టర్ ప్రదీప్ కుమార్ అంగడి తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్ అఫ్ ది మ్యాచ్ ట్రోఫీ అందుకుంటున్న డాక్టర్లు

కూటమి ప్రభుత్వానికి పట్టభద్రులు మద్దతుగా నిలవాలి

● మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు


తెనాలి: ఎన్నికల ప్రచారంలో బీటీనాయుడు, పార్టీ నాయకులు

పెదకాకాని, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతికి అహర్నిశలు కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి పట్టభద్రులు మద్దతుగా నిలవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు కోరారు. ఆదివారం పెదకాకాని మండలం జాతీయ రహదారిపై ఉన్న రైన్‌ట్రీ పార్క్ ఆవరణలో పట్టభద్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థికి ఓటు నిరుద్యోగుల ఉద్యోగావకాశాలకు తొలిమెట్టు అవుతుందన్నారు. తాడేపల్లి కేంద్రంగా జగన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నాడని ఆరోపించారు. 29 సంఘాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంకు మద్దతు పలుకుతుంటే.. అందరిదీ ఒక దారి ఉలిపి కట్టెది ఒకదారి అన్న చందంగా ఒక సంఘం వ్యతిరేకంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, మనోభావాలు, వారి ప్రయోజనాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం నడుచుకుంటుందని, వారి సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ బలపరిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి విజయాన్ని చేకూర్చాలని ఆయన కోరారు. మంచి వ్యక్తిత్వం కలిగిన ఆలపాటికి పట్టభద్రులు మద్దతుగా నిలవాలని, శాసనమండలి ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వానికి అఖండ విజయాన్ని చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రథమ ప్రాధాన్య ఓటుతో ఆలపాటిని గెలిపించండి

● ఆదోని తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు బీటీ నాయుడు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగబోయే కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ఓటు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేసి ఘన విజయంతో గెలిపించాలని ఆదోని ఎమ్మెల్సీ, తెనాలి నియోజవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు బీటీ నాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పట్టభద్రులైన ఓటర్లను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించి ఘన విజయం చేకూర్చారని ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరగబోయే తొలి ఎన్నికలు ఎమ్మెల్సీ ఎన్నికలన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మంచి మనస్సుతో ఆశీర్వదించాలన్నారు. ఆలపాటికి తెనాలి, వేమూరు నియోజవర్గాల్లో మంచి నాయకుడిగా గుర్తింపు ఉందన్నారు. ప్రతి ఒక్క పట్టభద్రులు ప్రథమ ఓటు ఆలపాటికి వేసి ఆయనను పెద్దలసభలో గళం వినిపించేలా బాధ్యత తీసుకోవాలని బీటీ నాయుడు కోరారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, జొన్నాదుల మహేష్, ఈదర వెంకటపూర్ణ చంద్, పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి గెలుపుతో ఉద్యోగులకు భరోసా

తెనాలి రూరల్, తెనాలి అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల కష్టసుఖాలు తెలిసిన నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే వారికి భరోసాగా నిలుస్తారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కాకతీయ కో ఆపరేటివ్ బ్యాంక్‌లో చైర్మన్ డీఎల్ కాంతారావు అధ్యక్షతన ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలని కోరుతూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గత వైసీపీ ప్రభుత్వం మాదిరి వేధింపులకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వారి బాధ్యతలను నిర్వహించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు అందించి నిబద్ధత కలిగిన ప్రభుత్వంగా పేరుపొందిందన్నారు. తెలుగుదేశం పార్టీలో కీలక పాత్ర పోషించి మంత్రిగా పని చేయడంతో పాటు కూటమి సర్దుబాటులో భాగంగా తెనాలి స్థానాన్ని త్యాగంచేసిన ఆలపాటి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో ఎంతో సేవలందించారని, పార్టీ అభివృద్ధికి కృషి చేశారని, వేమూరు, గుంటూరులో తనదైన శైలితో పార్టీ కోసం ప్రజల కోసం పాటుపడ్డారని చెప్పారు. కూట మి కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను పట్టభద్రులందరూ ప్రథమ ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంతారావు మాట్లాడుతూ మంచి మనసు ఉన్న నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టభద్రులందరూ ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటికి ప్రథమ ఓటువేసి ఘన విజయంతో గెలిపించాలని కోరారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న కాకతీయ కో ఆపరేటివ్ బ్యాంక్ కార్యవర్గ సభ్యులు

ఇంటింటి ప్రచారం

కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును కాంక్షిస్తూ టీడీపీ శ్రేణులు పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఆలపాటిని గెలిపిస్తే నిరుద్యోగులకు, ఉద్యోగులకు జరిగే మంచిని వివరించి ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెండ్యాల సుబ్బారావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ సీనియర్ నాయకుడు కొఠారు అంజనేయులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అత్తోటలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి విజయం టీడీపీ, జనసేన నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలో పట్టభద్రులను, ఉద్యోగులను కలిసి మొదటి ప్రాధాన్య ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కువేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ ఆలపాటిని గెలిపించుకోవటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లుముంత వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ దివ్వెల ఏడుకొండలు, టీడీపీ, జనసేన నాయకులు దాసరి నరసయ్య, బొద్దులూరు అశోక్, యర్రు కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.


అత్తోటలో ఆలపాటి గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు



సంగం జాగర్లమూడి రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సంగంజాగర్లమూడి రోడ్డుకు మరమ్మతులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సంగం జాగర్లమూడి అంగలకుదురు మీదుగా జిల్లా వైద్యశాలకు వచ్చే రోడ్డుకు వేసిన తారు, చిప్స్, డస్టు వేరై గుంతలమయంగా మారిన విషయాన్ని శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు. ఆదివారం సంగంజాగర్లమూడి తెనాలి మార్గంలో ఏర్పడిన గుంతలను పూడ్చుతూ ప్యాచ్‌వర్క్ పనులను చేట్టారు. దీనితో గుంతలమయంగా ఉన్న రోడ్డులో పయనించే వాహనదారులకు కొంతమేర ఊరట లభించనుంది. రోడ్డు ప్యాచ్ వర్క్‌లను పూర్తిగా నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి వేలాదిమంది వాహనదారులు రోడ్డుపై ఉన్న గుంతల వలన ప్రమాదాలబారిన పడకుండా అధికారులు తమవంతు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. రోడ్ల దుస్థితిపై సవివరంగా కథనాన్ని ప్రచురించి సమస్య పరిష్కారానికి కృషిచేసిన ఆంధ్రజ్యోతికి పలువురు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.


విశ్వకర్మ దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన ప్రజ్ఞానంద సరస్వతి, ఈవో మల్లేశ్వరి, రమణయ్య తదితరులు

విశ్వకర్మ దేవాలయంలో బాలస్వామి ప్రత్యేక పూజలు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని విరాట్ విశ్వకర్మ దేవాలయంలో ఆదివారం పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి), స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారి విశిష్టతలను భక్తులకు ప్రవచనం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన బాలస్వామికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఈవో మల్లేశ్వరి, బాలస్వామికి పట్టువస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం, ట్రస్ట్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణాలలో అధికారుల తనిఖీలు


మాంసం దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు, కొలతల శాఖల అధికారులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) పొన్నూరు మండలంలో ఆదివారం మాంసం దుకాణాలలో తూనికలు, కొలతల శాఖల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తూనికలు, కొలతల శాఖల ఇన్‌స్పెక్టర్ బీ శేషసాయి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో 25 ప్రాంతాలలో తనిఖీ నిర్వహించారు. కాటాలను పరిశీలించి కొలతలలో తేడా ఉన్న దుకాణాలపై కేసులను నమోదు చేసి రూ.15వేల అపరాధ రుసుం విధించారు. అంతేకాకుండా కాటాకు ప్రతి ఏడాది తూనికలు, కొలతల శాఖల అధికారుల వద్ద సీల్‌లు వేయించుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా చేపలు విక్రయించే వీధి వ్యాపారుల కాటాలలో తేడాలు ఉన్నట్లు వినియోగదారుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శేషసాయి తెలిపారు. 15మందిపై కేసులను నమోదుచేసి వారికి రూ.15వేల అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. ఈ తనిఖీలలో లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు, రవికిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న శ్రీబాలకోటేశ్వరస్వామి ఉత్సవ పనులు

అమృతలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవా ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయం ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు, పాలకమండలి, ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆల యానికి, ఉపాలయాలకు రంగులు వేస్తు న్నారు. ఆలయం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తీసివేయడంతోపాటు, యంత్రాల తో చదును చేయిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే పనులను ఆలయ ఈవో అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఆలయ ఉత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. చలువ పందిళ్లు వేయడం పూర్తి చేశారు. ఇక్కడ అయిదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. ఇప్పటికే అధికా రులు ఉత్సవాల ఏర్పాటుపై రెండుసార్లు సమావేశాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సి చర్యలపై చర్చించారు.


ఆలయ సమీపంలో ఎక్స్‌కవేటర్‌తో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న చిత్రం


ప్రధాన ఆలయానికి రంగులు వేస్తున్న కూలీలు

శివరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం

● పలు గ్రామాల్లో విద్యుత్ ప్రభల నిర్మాణం

చేబ్రోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే మహిమాన్విత శైవ క్షేత్రం క్వారీ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. శివరాత్రి సందర్భంగా నిర్వహించే ఉత్సవాల కోసం ఆలయం వద్ద చలువ పందిళ్ల నిర్మాణంతో పాటు భక్తుల దర్శనార్థం క్యూలైన్‌ల ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే శివరాత్రి సందర్భంగా నిర్వహించే క్వారీ తిరునాళ్లకు ప్రత్యేక ఆకర్షణ అయిన భారీ విద్యుత్ ప్రభల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. కోటప్పకొండ తిరునాళ్ల తరువాత అంతటి స్థాయిలో క్వారీ తిరునాళ్లకు పదుల సంఖ్యలో విద్యుత్ ప్రభలను నిర్మించి భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకోవడం దశాబ్దాలుగా ఆనవాయితీ. చేబ్రోలు మండలంలోని నారాకోడూరు గ్రామంలోనే 50 నుంచి 70 అడుగుల ఎత్తయిన విద్యుత్ ప్రభలను నిర్మించడంతో పాటు ఉత్సవాలకు శివరాత్రి రోజు వ్యయప్రయాసలకు ఓర్చి ప్రభలను తరలిస్తారు. మండల పరిధిలోని వేజెండ్ల, వడ్లమూడి, గుండవరం, గొడవర్రు, నారాకోడూరు గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు క్వారీ దేవాలయం వరకు ఆటంకాలు లేకుండా చేరుకునేలా మార్గం సుగమం చేస్తున్నారు. గతంలో జరిగిన చిన్న చిన్న లోటుపాట్లను దృష్టిలో ఉంచుకుని ప్రభల మార్గాన్ని ఎటువంటి అవాంతరాలు జరగకుండా ప్రభల రాకపోకలకు వీలుగా ఉండేలా అధికారులు ముందు జాగ్రత్తచర్యలు పాటిస్తున్నారు. అంతేకాకుండా క్వారీ దేవాలయం వద్ద భారీ విద్యుత్ ప్రభలు నిలిపి ఉంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభల ఉత్సవాలను తిలకించేందుకు విచ్చేసే అశేష జనవాహినికి సరిపడా ఏర్పాట్లు కూడా రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో పది రోజులు శివరాత్రికి గడువు ఉన్న నేపథ్యంలో మరింత జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు.


శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతున్న భారీ విద్యుత్ ప్రభ

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు


ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న గాయకులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శారదా సంగీతాలయం ఆధ్వర్యంలో రామలింగేశ్వరపేట నుంచి రామాలయం వరకు రామనామ సంకీర్తనలతో ఊరేగింపు చేశారు. రామాలయంలో పంచరత్న కీర్తనలు ఆలపించారు. 50మంది గాయకులు కీర్తనలు చేశారు. ఆంజనేయశాస్త్రి శిష్యబృందం నరసింహకుమార్, శ్యామకృష్ణశర్మ, కొండపి శ్రీనివాసరావు, కేశవరావు పాల్గొన్నారు.

దశావతార వెంకన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

పెదకాకాని, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయంలోని మహాగణపతి స్వామి వారికి సంకటహర చతుర్థి సందర్భంగా ఘనంగా వ్రతాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కర్‌రావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.


దశావతార వెంకన్న సన్నిధిలో జరిగిన పూజలో పాల్గొన్న భక్తులు

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని సాయి సేవా సమితి సభ్యులు నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డులో ఆదివారం సాయి సేవా సమితి సభ్యులు కేసీ చాందనా 15వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీఎస్పీ జనార్ధనరావు పాల్గొని పేదలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయి సేవా సమితి సభ్యులుగా పేదలకు చాందనా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వీసీ చందనా, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.


పేదలకు ఆహారం పంపిణీ చేస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సాయి సేవా సమితి సభ్యులు తదితరులు